

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు నేడు వంకవారిగూడెంలో గ్రామ సభ

జీలుగుమిల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు భూ సేకరణ కోసం సోమవారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు వంకవారిగూడెం సర్పంచ్ కుంజా పార్వతి ఓ ప్రకటనలో తెలిపారు. భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపి తీర్మానం చేస్తారని తెలిపారు.



ప్రీమియం.. చెల్లించాల్సిందే!

- పీఎంఎఫ్‌బీవైకు నూతనంగా విడుదలైన మార్గదర్శకాలు
- దిగుబడి ఆధారంగానే క్లెయిమ్స్ పరిష్కారం
- కౌలు రైతులకు బీమా సౌకర్యం అందని ద్రాక్షే అంటున్న రైతు సంఘాలు

ఏలూరు సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)కి సంబంధించి నూతన మార్గ దర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. రబీ 2024-25 సంవత్సరానికి సంబంధించి పీఎంఎఫ్‌బీవై కింద క్లెయిమ్‌లు రాష్ట్ర ప్రభుత్వం అందించిన దిగుబడి డేటా ఆధారంగానే పరిష్కరించబడతాయి. రబీ 2024-25 సీజన్ రైతులు, షేర్ క్రాపర్లు, కౌలు రైతులతో సహా అందరూ నోటిఫైడ్ ఏరియాల్లో నోటిఫైడ్ పంటలను సాగు చేస్తే స్వచ్ఛందంగా పీఎంఎఫ్‌బీవైలో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ సారి గతంలో మాదిరిగా కాకుండా పీఎంఎఫ్‌బీవైకి సంబంధించి రైతుల వాటా చెల్లించాలి. గత టీడీపీ హయాంలో ఈ రైతుల వాటా ఒక రూపాయి చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు వెసులుబాటు కల్పిస్తున్నా మని చెప్పి ఈ పంటల బీమా పథకాన్ని ఉచిత పంటల బీమా పథకంగా అమలు చేసింది. అయితే రెండేళ్ల పాటు ఇది సజావుగానే సాగి నా ఆ తర్వాత ఈ బీమా పథకం సక్రమంగా అమలు కాలేదు. దీంతో రైతులు పంట నష్ట పోయినా పరిహారం అందలేదు. ఇప్పుడు తాజా గా రైతులు ఈ పథకంలో తమ వాటా ప్రీమియం చెల్లించాలి. అయితే సార్వాలో ప్రభుత్వం పూర్తిగా రైతుల వాటా ప్రీమియం చెల్లించింది. ఇప్పుడు బ్యాంకులలో రుణాలు తీసుకునే రైతులకు అక్కడే పీఎంఎఫ్‌బీవై ప్రీమియం కట్ చేస్తున్నారు. మిగిలిన వారు ఆన్‌లైన్ లో, మీ సేవా కేంద్రాల ద్వారా, వ్యవసాయ శాఖ ద్వారా చెల్లించాల్సి ఉంది. ఎన్‌సీఐపీలో వివరాలను అప్‌లోడ్ చేసిన రైతులు మాత్రమే బీమా కవరేజికి అర్హులు కావడంతో పాటు ప్రీమియం సబ్సిడీలను అందుకుంటారు. చెల్లింపు, ప్రీమియం ఆలస్యం కారణంగా, డేటా సమర్పణలో తప్పులు కారణంగా ఎవరైనా రైతు బీమాను తిరస్కరించినట్లయితే బ్యాంకులు జవాబుదారీగా ఉంటాయి. పీఎంఎఫ్‌బీవై కోసం క్లస్టర్ వారీగా ఏజెన్సీలు ఉంటాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ క్లస్టర్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. జిల్లాలో 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించి వరి , మొక్కజొన్న, పెసర, మినుము పంటల బీమాకు సంబంధించి క్లెయిమ్‌లు పొందడానికి వరికి విలేజ్ ఇన్స్యూ రెన్స్ యూనిట్‌గా పరిగణిస్తుండగా, మొక్క జొన్న , పెసర, మినుము పంటలకు మండల ఇన్స్యూరెన్స్ యూనిట్‌గా పరిగణిస్తారు.

రబీ సాగుకు పంటల ఆధారంగా ప్రీమియం చెల్లింపు వివరాలు

రబీ 2024-25అండ్ 25-26కు సంబంధించి వరి పంటకు ఎకరానికి 1.22 శాతానికి సంబంధించి రూ.500 ప్రీమియం డిసెంబరు 31వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాలి. మొక్క జొన్నకు సంబంధించి ఎకరానికి 1.15 శాతం చొప్పున రూ.483 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. డిసెంబరు 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాలి. పెసర పంటకు ఎకరానికి 0.30 శాతం చొప్పున రూ.60 ప్రీమియం చెల్లించాలి. డిసెంబరు 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలి. మినుము పంటకు 0.30 శాతం చొప్పున రూ.60 ఎకరానికి ప్రీమియం చెల్లిం చాలి. డిసెంబరు 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. పీఎంఎఫ్‌బీవై పథకానికి సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పంటలు సాగు చేసే రైతులు 8లక్షల మంది వరకు ఉండగా ఇప్పుడు తాజాగా ఏలూరు జిల్లాలో రెండున్నర లక్షల మంది వరకు రైతులు ఉంటారని చెబుతున్నారు.

కౌలు రైతులకు ఎప్పుడూ నష్టమే

ఈ పంటల బీమా పథకం వల్ల కౌలు రైతులకు ప్రయోజనం అంతంత మాత్రమే. బ్యాంకులలో రుణం తీసుకునేటప్పుడే బీమా ప్రీమీయం కట్ చేసుకుంటే యజమానులకే బీమా పరిహారం అందే అవకాశాలున్నాయి. వాస్తవంగా సాగు చేసేది ఎక్కువ శాతంలో కౌలు రైతులున్నారు. వారికి అంతంత మాత్రంగానే కౌలు రుణ అర్హత కార్డులు ఉన్నాయి. రుణాలు అందేది కూడా తక్కువ శాతం మందికే. ఉచిత పంటల బీమా అమలు చేస్తే కౌలు రైతులకు మేలు చేకూరుతుంది.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి



రూ.8 కోట్లతో కట్టి..వదిలేశారు!

జలదిగ్బంధంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాలు

కలిదిండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కలిదిండి శివారున నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాలు జలదిగ్బంధనంలో ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆవరణమంతా వర్షపు నీటితో నిండింది. భవనాల పనులు అసంపూర్తిగా ఉండగానే ఎన్నికల ముందు 2024 ఫిబ్రవరిలో హడావిడిగా ప్రారంభించారు. ఇప్పటి వరకు నూతన భవనాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీంతో కలిదిండి జడ్పీ హైస్కూల్‌లోని భవనంలో పాలిటెక్నిక్ విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నారు. మొత్తం 70 మంది విద్యార్థులు ఉన్నారు. రూ.ఎనిమిది కోట్లతో నూతన భవనాలు నిర్మించి ప్రారంభించినా క్లాసుల నిర్వహణలో జాప్యం జరగడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



గతంలోని టీడీపీ ప్రభుత్వం హయాంలో గ్రామంలో ముంపునకు గురవుతున్న ఇళ్లు ఉన్నాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వంలో 110 ఇళ్ల పేర్లు గల్లతయ్యాయి. అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వమైన మాకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం.

- ఎం.వెంకన్నబాబు, కివ్వాక గ్రామస్థుడు



కివ్వాక గ్రామంలో జాబితాలో ఇళ్లు గల్లంతైన 3వ వార్డు

- నిర్వాసితులను వెంటాడుతున్న వైసీపీ ప్రభుత్వం తప్పిదాలు
- న్యాయం చేయాలంటూ బాధితుల వేడుకోలు

పరిహారం జాబితాలో ఇళ్లు మాయం!

కుక్కునూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలవరం నిర్వాసితులకు భరోసా లేకుండా పోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు వారిని వెంటాడుతున్నాయి. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు సర్వేలో భాగంగా ముంపు గ్రామాల్లోని నిర్వాసితులను గుర్తించి వ్యక్తిగత పునరావాస పరిహారం జాబితాలను, ముంపునకు గురవుతున్న ఇళ్లను సర్వే చేసి వాటి విలువను లెక్కగట్టి పరిహారం అందించనున్న ఇళ్ల జాబితాను ప్రకటించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో ఇళ్ల పరిహారం జాబితాలో వందలాది మంది నిర్వాసితుల ఇళ్లు గల్లంతయ్యాయి. వ్యక్తిగత పునరావాస పరిహారం జాబితాలో తమ పేర్లు ఉన్నప్పుడు, జాబితాలో మా ఇళ్లు ఎందుకు గల్లంతయ్యాయని నిర్వాసితులు ప్రశ్నించారు. దీంతో అప్పటి అధికారులు తప్పును సరిదిద్దుకునేందుకు పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. నిర్వాసితులంతా తమగోడును అధికారుల ముందు వినిపించి పరిహారానికి సంబంధించి జరిగిన అవార్డు పాస్ కార్యక్రమాలను అడ్డుకున్నారు. నిర్వాసితులంతా ఉన్నతాధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి తమ గోడును వినిపిం చారు. అయినా వారి ఇళ్లు తిరిగి పరిహారం జాబితాలో చోటు చేసుకోలేదు.

140 ఇళ్లను తొలగించి..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న గ్రామాల్లోని నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస పరి హారం, ముంపునకు గురవుతున్న ఇళ్లకు పరిహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల పునరావాస ప్రక్రియను వేగవంతం చేసింది. వేలేరుపాడు మండలం జగన్నాథపురంలో ప్రస్తుతం 330 ఇళ్లు ఉండగా 140 మంది నిర్వాసితుల ఇళ్ల పేర్లు జాబితాలో లేవు. 2017లో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అధికారులు జరిపిన ఎస్ఈఎస్ డేటాలో, డీడీ (డ్రాఫ్ట్ డిక్లరేషన్) అవార్డు విచారణలోనూ 330 పేర్లు ఉండగా అవార్డు కూడా పాస్ చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 330 ఇళ్లకు 140 ఇళ్లు గల్లంతయ్యాయి. ఇటీవల కూటమి ప్రభుత్వంలో 140 మంది పేర్లు తొలగించి ఇళ్ల పరిహారానికి అవార్డు పాస్ చేశారని బాధిత నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. కుక్కునూరు మండలంలోని కుక్కునూరు-ఏ బ్లాక్‌లో దాదాపు 130 మంది ఇళ్లు జాబితాలో గల్లంతయ్యాయి. కివ్వాకలో 495 మంది వ్యక్తిగత పునరావాస పరిహారం జాబితాలో ఉన్నారు. 411 ఇళ్లు ఉండగా ఇందులో 110 ఇళ్లు గల్లంతయ్యాయి. ఆ గ్రామంలోని 3వ వార్డులో ఉన్న ఇళ్లు ఎక్కువగా గల్లంతైనట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



జాబితాలో గల్లంతైన కివ్వాకలోని తమ ఇంటి వద్ద బాధిత నిర్వాసితుడు భట్టు రమేష్



పట్టిసీమ ఈవోగా చాగంటి సురేష్‌నాయుడు

పోలవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ శివక్షేత్ర నూతన కార్య నిర్వహణాధికారిగా చాగంటి సురేష్ నాయుడు బాధ్యతలు చేపట్టారు. భీమవరం గునుపూడి దేవస్థానంలో ఈవోగా పనిచేస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దేవదాయ శాఖ అధికా రుల ఆదేశాల మేరకు పట్టిసీమ శివక్షేత్రంతో పాటు గూటాల లక్ష్మీ నరసింహస్వామి, పోలవరం పెదరామాలయం, పోలవరం గ్రామ దేవత కడెమ్మ అమ్మవారి ఆలయాలను పర్య వేక్షించనున్నట్టు తెలిపారు. కాగా ఇప్పటి వరకు ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సంగమేశ్వర శర్మ రాజమండ్రికి బదిలీ అయ్యారు.

చదువుకు సాంకేతికత జోడిస్తే అద్భుతాలు

- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

తాడేపల్లిగూడెం ఏపీ నిట్ ఆడిటోరియంలో విద్యార్థులకు స్పందనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అకడమిక్ ఎచీవ్‌మెంట్ బూస్ట్ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ సెమినార్‌లో త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనా రెడ్డి పాల్గొని మాట్లాడారు. -9లో



శ్రీవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

గోవిందా..గోవిందా

గోవిందనామాలతో పులకించిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోవింద నామాలతో ద్వారకాతిరుమల క్షేత్రం మారుమోగింది. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఆలయానికి దాదాపు 12వేల మంది పైబడి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. భక్తులు ముందుగా కేశఖండనశాలలో మొక్కు బడులు తీర్చుకున్నారు. శ్రీవారి సాధారణ దర్శనానికి 2గంటల పైబడి సమయం పట్టింది.

పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే.. ప్రజలకు మెరుగైన సేవలు : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని, పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి ఒక్కరికి ఆరోగ్యపరీక్షలు చేయిస్తామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించగా ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తార న్నారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఆర్ఐ పవన్‌కుమార్, ఆశ్రం డీజీఎం సాయి శ్రీనివాస్, ఆంధ్రా ఆసుపత్రి వైద్యాధికారులు మురళీకృష్ణ, స్టార్‌డెంటల్ ఆసుపత్రి డాక్టర్ ఎస్ఎస్, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి డాక్టర్ శ్రావణి, శ్రీ డెంటల్ డాక్టర్ నాగభూషణం పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. న్యూట్రీషన్, డైట్, వ్యాయామం అనే అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్



ఎన్నికలా.. ఏకగ్రీవమా..?

- వచ్చే నెల 8న జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికలు
- 15 ఏళ్లుగా ఏకగ్రీవం.. ఈసారి పోటాపోటీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. దానిలో భాగంగా మొదట విద్యా కమిటీలకు ఎన్నికలను పూర్తి చేసింది. ఆ తరువాత సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ ఇచ్చింది, ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చింది. వచ్చే నెల 8న ఈ ఎన్నిక జరగనుంది. గత 15 ఏళ్లుగా ఈ పాలక మండలి ఏకగ్రీవంగా జరుగుతూనే వచ్చింది. ఈసారి గట్టి పోటీ నెలకొంది. దీంతో ఏకగ్రీవమా..... ఎన్నికలా అన్నది సస్పెన్స్‌గా మారింది.

నరసాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం, ఉండి, ఆచంట, సిద్ధాంతం, గుటాడ, తాళ్ళరేవు, కొవ్వూరు, పోలవరం, పెనుగొండ ప్రాంతాల్లో అత్యధికంగా మత్స్యకారులు ఉన్నారు. వేట వీరి జీవనాధారం. ప్రభుత్వం వీరికి అందించే వేట సామగ్రి, సబ్సిడీ రుణాలు వంటివి సొసైటీల ద్వారా అందుకుంటారు. జిల్లా వ్యాప్తంగా 130కు పైగా మత్స్య సహకార సొసైటీలు ఉన్నాయి. ఒక్కొక్క సొసైటీలో 200 నుంచి 500 వరకు సభ్యులు ఉంటారు. కొన్ని సంఘాల్లో 600 నుంచి 800 వరకు కూడా సభ్యులు ఉన్నారు. ఒక పేరుతో సొసైటీని రిజిస్ట్రేషన్ చేసుకుని దాన్ని స్థానిక మత్స్యశాఖ అధికారి వద్ద నమోదు చేయించుకుంటారు. ఆ సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులతో పాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకుంటారు. వీరి పదవి కాలం ఐదేళ్లు. అంటే రిజిస్ట్రేషన్ అయిన దగ్గర నుంచి లెక్కగడతారు. ఈకారణంగా జిల్లాలోని 130 మత్స్య సహకార సంఘాలకు ఒకేసారి ఎన్నికలు జరగవు. అయితే జిల్లా పరిధిలో ఉండే మత్స్యకార సొసైటీకి మాత్రం ఐదేళ్లకు ఒక్కసారి ఎన్నికలు నిర్వహిస్తారు. వచ్చే నెల 8న ఈ సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లా మత్స్యశాఖ అధికారి పర్యవేక్షణలో ఏలూరులో ఎన్నికలు జరగనున్నాయి. ఉమ్మడి పశ్చిమలోని 130 మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు కలిసి జిల్లా సంఘాన్ని ఎన్నుకోనున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతో పాటు 9 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకోనున్నారు.

ఈసారి పోటాపోటీ....

రాష్ట్ర విభజనకు ముందు నుంచి జిల్లా సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరుగుతూ వస్తోంది. నరసాపురం ప్రాంతానికి చెందిన అంద్రాజు చల్లారావు జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈసారి కూడా ఆయన పోటీలో నిలవనున్నారు. 15 ఏళ్లుగా ఆయనే వ్యవహరించడంతో ఈసారి ఏలూరు జిల్లా నుంచి కూడా ఈ పదవిని ఆశించే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. ఈనేపథ్యంలో 8న జరిగే ఎన్నికల్లో గతంలో మాదిరిగా.. ఏకగ్రీవం అవుతుందా? లేక ఎన్నికలు జరుగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

మాజీ ఎమ్మెల్యే గ్రంథిపై పవన్ కల్యాణ్ ఫిర్యాదు

జగనన్న ఇళ్ల భూసేకరణలో అక్రమాలు జరిగాయన్న పవన్



భీమవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌పై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. భీమవరంలో జగనన్న కాలనీల పేరుతో నిర్వహించిన భూసేకరణలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు సారాంశం. భీమవరంలో పేదల ఇళ్ల కోసం దాదాపు 140 ఎకరాలు సేకరించారు. బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చర్యలు తీసుకుని భారీగా లబ్ధిపొందారంటూ పవన్ కల్యాణ్‌కు భీమవరం నుంచి ఫిర్యాదు వెళ్లింది. గతంలోనే భూసేకరణపై అనేక విమర్శలున్నాయి. తాజాగా అందిన ఫిర్యాదుపై పవన్ కల్యాణ్ స్పందించారు. అదే విషయంపై జిల్లా కలెక్టర్ నాగరాణికి తెలిపారు. భూసేకరణలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని సూచించారు. లిఖిత పూర్వకంగానూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. భీమవరంలో ఈ విషయం రాజకీయంగా వేడెక్కించింది. ఇటీవల వైసీపీకి మాజీ ఎమ్మెల్యే గ్రంధి దూరంగా ఉంటున్నారు. ఆ పార్టీ నేతలు బుజ్జగింపులు చేసిన ఫలించలేదు. మరోవైపు గ్రంధి తన రాజకీయ వ్యూహాన్ని మారుస్తారంటూ ప్రచారం సాగుతోంది. ఈ తరుణంలో పవన్ కల్యాణ్ ఫిర్యాదు రాజకీయంగానూ ప్రాధాన్యతను సంతరించుకున్నది.

మద్యం మత్తులో ఒకరి హత్య

- ముగ్గురి మధ్య వివాదం.. పోలీసుల అదుపులో ఒకరు, మరొకరు పరారీ

-9లో

అగ్రి కల్చర్

వరిలో తెగుళ్లా..? ఇట్టే కనిపెట్టేస్తుంది..!

ఎన్‌పిఎస్‌ఎస్ యాప్‌తో రైతులకు మేలు



భీమవరం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి) : టెక్నాలజీ ఇప్పుడు చేతిలోకి వచ్చింది. రైతులకు కూడా సాంకేతిక పరిజ్ఞానం అవసరపడుతోంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా రైతులు కూడా దాన్ని అంది పుచ్చుకోవాలి. సాగులో చీడపీడల గుర్తింపు, వాటి నివారణ చర్యల వివరాలు ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌తో సెకన్లలోనే అందుకునే అవకాశం వచ్చింది. సెంట్రల్ గవర్నమెంట్ , ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ రైతులకు ఉపయోగపడేలా యాప్‌ను తీసుకువచ్చాయి. సాగులో తెగుళ్లను గుర్తించాలంటే వ్యవసా యాధికారి రావాలి. లేదంటే సంబంధిత వివ రాలతో అధికారి దగ్గరకు వెళ్ళాలి. వీటికి స్వస్తి చెప్పడానికే ఈ యాప్ రైతుల చెంతకు చేర్చా మని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులకు యాప్ పనిచేసే విధానాన్ని అవగా హన కల్పించేందుకు డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్ ద్వారా అధికారులు సూచనలు ఇవ్వనున్నారు. వారితో పాటు జిల్లాలో 364 రైతు సేవ కేంద్రాల సిబ్బంది వారి పరిధిలోని రైతులకు ముందుగా ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేస్తారు. దీనిపై వ్యవసా యశాఖ ఏపీడీ, ఏడీలు రైతులకు అవగాహన కల్పించనున్నారు.

యాప్ పనితీరు ఇలా..

ఎన్‌పీఎస్‌ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వే లైన్స్ సిస్టమ్)యాప్‌లో సెకనులో సమాచారం అందుతుంది. రైతుల సాగుకు పట్టిన పురుగులు, తెగుళ్ళ ఫొటోలు తీసి యాప్‌లో పెట్టాలి. ఆ తెగుళ్ళకు సంబంధించిన వివ రాలు మేసేజ్ రూపంలో వస్తాయి. ఏ మందులు పిచికారీ చేయాలి ? ఎలా చేయాలి? అనే సమాచారం కూడా వచ్చే స్తుంది. ఒక వేల ఆ పురుగులు మిత్ర పురు గులు అయితే అవి హానిలేని పురుగులు అని మేసేజ్ వస్తుంది. ఈ యాప్‌లోనే క్వాలిటీ, క్వాంటిటీలుగా రెండు వివరాలు తెలుసుకునేవి ఉంటాయి. క్వాలిటీ ద్వారా దీనిలో రైతులు వారి సాగు ఫోటోలు అప్‌లోడ్ చేస్తే తేదీ, వివ రాలు ఏ స్థాయిలో తెగలు ఉన్నదీ, నివారణ వివరాలు వస్తాయి. క్వాంటిటీలో అయితే అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉపయోగిస్తారు. ఎప్పటి కప్పుడు సాగు వివరాలు దానిలో పొందుపరు స్తారు. ఈ యాప్ పూర్తిగా రైతుల చెంతకు వెళితే రైతులు సాగుకు వచ్చే తెగుళ్ళ గురించి కంగారుపడవలసిన అవసరం ఉండదని వ్యవ సాయ అధికారులు ఆలోచనలో ఉన్నారు.

ఆవు మజ్జిగతో వరి సాగు

ఆరోగ్యమే మహాభాగ్యం.. అటువంటి ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ప్రస్తుతం మనం తింటున్న అన్ని ఆహార పదార్థాలు ఎరువులు, పురుగు మందులు వినియోగించి ఉత్పత్తి చేసినవే. వీటినే తిని ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నాం. అయితే ఆచంటలో చిలుకూరి విశ్వేశ్వరరావు అనే రైతు తన నాలుగు ఎకరాల వరి పొలంలో ఎరువులు, పురుగు మందులు వాడకుండా పులిసిన ఆవు మజ్జిగతో వరి సాగు చేస్తున్నారు. తన ఆరోగ్యంతో పాటు ఇతరుల ఆరోగ్యం కూడా బాగుండాలనే ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయంపై పదిమందికీ చెబుతున్నారు.



- తక్కువ పెట్టుబడితో వ్యవసాయం
- ఆచంటలో ఒక రైతు
- సేంద్రియ పద్ధతిలో సాగు
- ఆరోగ్యానికి ఎంతో మంచిది..

ఆచంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 2019లో ఆచంటలో రైతు చిలుకూరి విశ్వేశ్వ రరావు తనకు ఉన్న నాలుగు ఎకరాల పొలంలో మొదటి సారిగా ఎకరం పొలంలో ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం గిరి ఆవు పుల్ల మజ్జిగ , పంచగవ్య జీవామృతంతో సాగు చేశారు. మొదట్లో కాస్త దిగుబడి తగ్గినప్ప టికీ ఖర్చు తక్కువ అవడంతో తన నాలుగు ఎకరాల్లో నాలుగు సంవత్సరాలుగా ఎరువులు వాడకుండానే వ్యవసాయం చేస్తున్నారు. క్రమేణా దిగుబడి కూడా పెరగడంతో ఇదే విధానం కొనసాగిస్తున్నారు. సార్వాకు సంబంధించి ఎండీయు 1318 రకం , దాళ్వాలో సన్నబియ్యంకు సంబంధించి ఆర్ఎన్ఆర్ రకాన్ని సాగు చేస్తు న్నారు. సార్వాకు ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు దాళ్వాకు 40 నుంచి 45 బస్తాలు దిగు బడి వస్తుందని చెబుతున్నారు. ధాన్యం అమ్మకుండా ఆడించి అవసరమైన వారికి బియ్యం అమ్ముతున్నారు. రసాయనాలు వాడకుండా పండించిన ధాన్యం కోసం చాలామంది ఎదురు చూస్తున్నారని అలాంటి వారందరూ తన దగ్గరకు వచ్చి బియ్యం తీసుకువెళుతున్నారని రైతు చెబుతున్నారు.



ఆవు పుల్లమజ్జిగతో సాగు చేస్తున్న వరి పొలం

మజ్జిగ కోసం ఆవుల పెంపకం

ఈ విధానంలో ఆవు మజ్జిగ ఎక్కువగా వినియోగిస్తారు. ఆవు మజ్జిగ కోసం ఇతరులపై ఆధారపడకుండా రైతు తన పొలం వద్ద ఏకంగా 20 ఆవులను మేపుతూ పాడి వ్యవసాయం కూడా చేపట్టారు. ప్రత్యేకంగా షెడ్డు వేసి ఆవు లను పెంచుతున్నారు. ఆవుపాలను మజ్జిగ చేసి ఆ మజ్జిగను నిల్వ చేసి పులిసిన మజ్జిగను ఈ విధానానికి ఉపయోగిస్తారు. 15 రోజుల పాటు డ్రమ్ముల్లో మజ్జిగను నిల్వ ఉంచుతారు. సార్వాకు సంబంధించి నాలుగు సార్లు, దాళ్వాకు సంబం ధించి ఎనిమిది సార్లు ఈ పులిసిన మజ్జిగ స్ప్రే చేస్తారు. ఎకరానికి 30 లీటర్ల మజ్జిగను స్ప్రే ద్వారా వినియోగిస్తున్నారు. 15 నుంచి 20 రోజుల వ్యవధిలో స్ప్రే చేయాల్సి ఉంటుంది. పంట ఈనిక దశలో పంచగవ్యాలను కలిపి స్ప్రే చేస్తారు. అంటే ఆవుపేడ, గోమూత్రం, ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవునెయ్యిలను కలిపి ఎకరానికి మూడు లీటర్లు చొప్పున రెండు నుంచి మూడు స్లారు స్ప్రే చేయాల్సి ఉంటుందని రైతు వివరించారు.

సేంద్రియ సాగు వైపు సాగాలి

చిలుకూరి విశ్వేశ్వరరావు, రైతు



నాకున్న నాలుగు ఎకరాల పురుగు మందులు వాడకుండా వరి సాగు చేస్తున్నాను. దిగుబడి బాగానే వస్తుంది. పెట్టుబడి తక్కువ. ఈ బియ్యం తినడం వల్ల ఎటువంటి అనారోగ్యం ఉండదు. ఎరువులు, పురుగు మందులు వాడని కారణంగా ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ విధానం ద్వారా ఎకరానికి కేవలం రూ.15 వేల రూపాయలు లోపు మాత్రమే ఖర్చు అవు తుంది. నేను పండించిన వరి ఆడించి బియ్యం మాత్రం విక్రయిస్తాను. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మంది బియ్యం తీసుకెళుతున్నారు. అంద రూ ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ సాగు వైపు రైతులు దృష్టిపెట్టాలి.

మందార అందాలు



పూలను చూస్తే మనసు పరవశిస్తుంది.. రంగుల రంగుల పూవులు ఆహ్లాదాన్ని ఇస్తాయి.. సాధారణంగా ఒక్కో పువ్వు ఒక్క రంగులో కనిపిస్తుంటాయి. మందారాలు తెలుపు, ఎరుపు, గులాబీ రంగుల్లో పూస్తుంటాయి. అయితే ఆకివీడులో ఆలయ అర్చకుడు నివాసం దగ్గర మందారం మొక్కకు రెండు రంగులతో పుష్పం పూసింది. దీంతో చుట్టుపక్కల వారు వింతగా చూశారు. ఇలా పూయడం ఇదే మొదటిసారని అర్చకుడు చెప్పాడు.

-ఆకివీడు



అమ్మవారి దర్శనానికి పెరుగుతున్న భక్తుల తాకిడి

బుట్టాయగూడెం, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): : మన్యం బిడ్డల ఇలవేల్పు గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోడానికి వారం వారం ఏజెన్సీకి వస్తున్న భక్తుల పెరుగుతోంది. వర్షాలు తగ్గుముఖం పట్టి పొడి వాతావరణం ఉండ టంతో భక్తులు క్రమేపీ పెరుగుతున్నారు. ఆది వారం కూడా అధిక సంఖ్యలో భక్తులు ఏజెన్సీకి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఏజెన్సీ చుట్టుపక్కల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తున్నట్టు ఆలయ కమిటీవారు తెలి యజేస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌక ర్యాలు కలగకుండా కమిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పెదపుల్లేరులో సహస్ర గళ హనుమాన్ చాలీసా

ఉండి అక్టోబరు 27: హిందూ సంప్రదాయా లను అనుసరించి నడుచుకుంటూ అన్ని మతా లను గౌరవించాలని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం ఉండి మండలం పెదపుల్లేరులో శ్రీసత్తెమ్మ తల్లి ఆల యంలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి విభాగం వారు సహస్ర గళహనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ఘనంగా నిర్వహిం చారు. జైహనుమాన్ అంటూ పెదపుల్లేరు గ్రామం మారుమోగింది. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు అన్ని గ్రామాలలో నిర్వహించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లా డుతూ భక్తి పూర్వ కంగా ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభి నందనీయమన్నారు. కలిదిండి నరసింహరాజు వెంకటనాగ సరిత దంపతులు, కలిదిండి మురళీ కృష్ణంరాజు సుభ దంపతులు, శ్రీసీతా రామ లక్ష్మణ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపా ధ్యక్షుడు డా.జివిమాదవశర్మ, వీహెచ్‌పీ అఖిల భారత సంయుక్త ప్రధాన కార్యదర్శి కోటేశ్వర శర్మ, వబి లిశెట్టి వెంకటేశ్వర్లు, ఉద్దరాజు వేణు గోపాల రాజు, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస వర్మ

గుడిపాటి లలితకు ఏఎన్ఆర్ అవార్డు

ఏలూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గరికపాటి ఆర్ట్స్ థియేటర్ 269వ కార్యక్రమంలో భాగంగా అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఆదివారం రామ కృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో ఏఎన్ఆర్ అవార్డు ప్రదానోత్సవ ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సామాజిక సేవకురాలు, విద్యావేత్త డాక్టర్ గుడిపాటి లలితకు ఏఎన్ఆర్ అవార్డు అందించి సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు గరికపాటి కాళిదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మాట్లా డుతూ అక్కినేని నాగేశ్వరరావు మహానటుడే కాదని, గొప్ప మానవతా వాదన్నారు. తెలుగు సినిమా చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ బడిన అక్కినేని నాగేశ్వరరావు జయంతి రోజును స్మరించుకోవడం గర్వకారణమన్నారు. అనంతరం జయలక్ష్మి, గుడిపాటి రత్నశిరీష ఆలపించిన అమ్మవారి కీర్తనలు ఆహూతులను అలరించాయి.



సెమీ ఫైనల్‌కు బాస్కెట్‌బాల్ జట్లు

మార్టేరులో హోరాహోరీగా అండర్ -17 స్కూల్‌గేమ్స్ పోటీలు

పెనుమంట్ర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరులో జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ అండర్ -17 బాస్కెట్‌బాల్ లీగ్ మ్యాచ్లో హోరా హోరీగా జట్లు తల బడ్డాయి. మూడు జిల్లాల క్రీడాకారులు పాల్గొన్న క్వార్టర్ ఫైనల్లో జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా పోటీ సాగింది. గెలు పొందిన జట్లను సెమీఫైనల్‌కు ఎంపిక చేశారు.

క్వార్టర్ ఫైనల్ విజేతలు : పశ్చిమ గోదా వరి, కృష్ణ, అనంతపురం, తూర్పు గోదావరి జిల్లాలు సెమీఫైనల్‌కు ఎంపికయ్యాయి. బాలురు విభాగంలో నెల్లూరు, తూర్పు గోదా వరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు సెమీ ఫైనల్‌లో చోటు దక్కింది. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మల్లేశ్వరరావు, బాస్కెట్ బాల్ పరిశీలకుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి, పీవీఆర్ ట్రస్టు చైర్మన్ సూర్యనారాయణ, జాన్సన్, పీడీలు కృష్ణారెడ్డి, అంజలి పాల్గొన్నారు.

ప్రభుత్వాలు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్య తనిస్తూ జిల్లాకు ఒక్కొక్క క్రీడా నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.. టోర్నమెంట్‌కు వచ్చిన పలువురు క్రీడాకారులతో 'ఆంధ్రజ్యోతి' పలకరించగా తమ అభిప్రాయాలను చెప్పారు.

● ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం



చిన్ననాటి నుంచి స్కూల్స్‌లో క్రీడాకారులు ఆడుతుంటే చూసి ఆసక్తి కలిగింది నేను క్రీడా కారిణిగా రాణించాలని కోరికతో క్రీడల్లో పాల్గొంటున్నా. వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బాస్కెట్‌బాల్‌లో శిక్షణ పొందాను పశ్చిమగోదావరి జిల్లా టీంలో ఆడుతున్నాను. ఐపీఎస్ అధికారిగా ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం.

-సరిత, కస్తూరిబా స్కూల్, ఏలూరు

● మా అక్కనాకు ఆదర్శం



మా అక్క జాతీయ స్థాయిలో పాల్గొంది. నేను కూడా క్రీడా కారిణిగా రాణించాలని అనుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్‌స్కూల్ ఏర్పాటు చేసి చదువుతో పాటు క్రీడలపై శిక్షణ ఇస్తే మరింత మంది క్రీడాకారులు రాణిస్తారు.

- నందిని , కస్తూరిబా స్కూల్, ఏలూరు

● క్రీడా అకాడమీ ఏర్పాటు చేయాలి



బాస్కెట్‌బాల్‌లో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం. నా తండ్రి ఫిజికల్ డైరెక్టర్. నాలుగుసార్లు నేషనల్‌లో బాస్కెట్బాల్‌లో రాణించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడాకారిణిగా ఆడుతున్నాను ప్రభుత్వం క్రీడా అకాడమీ ఏర్పాటు చేసి స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో మైదానాలు వసతులు కల్పించాలి .మరింత మంది క్రీడాకారులు రాణించగలుగుతారు. డాక్టర్‌గా జీవితంలో స్థిరపడాలన్నదే నా కోరిక క్రీడలకు చదువుకు సమ ప్రాధాన్యం ఇస్తా.

-ఎం.లక్ష్మి మానస, కాకినాడ



తలపడుతున్న బాలుర జట్టు

స్పోర్ట్స్ కాలమ్

● ఇండియా టీంకు ఆడాలని..



బాస్కెట్‌బాల్ క్రీడలో ఇండియా టీంకు ప్రాతినిధ్యం వహించాల న్నదే నా కోరిక. అండర్-14 రాజస్థాన్‌లో, అండర్-17 పాండిచ్చేరిలో రెండు సార్లు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చా. క్రీడాకారుల కోటాలో రైల్వే ఉద్యోగిగా స్థిరపడాలన్నది నా లక్ష్యం. క్రీడా నైపుణ్యం కలిగిన స్కూల్స్‌ను ఏర్పాటు చేసి క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి.

-చరిష్మా, జడ్పీ స్కూల్, అంబాజీపేట

● జాతీయ స్థాయిలో రాణించాలి



తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామం ఉపాధ్యాయుల తర్ఫీదుతో జాతీయస్థాయి క్రీడాకారిణిగా రాణించా లన్నదే నా లక్ష్యం. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను. నా తల్లిదండ్రులు రోజువారీ కూలీలు.. క్రీడల పట్ల ఆసక్తి చూపడంతో వ్యాయామ ఉపాధ్యాయులు తర్ఫీదు ఇచ్చారు. పదిసార్లు రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని గెలుపొందాం.

-షేక్ వరహాన్ , నరసరావుపేట

స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి



22 సంవత్సరాలుగా అనేకమంది క్రీడాకారు లకు తర్ఫీదు నిచ్చా. అండర్-14, 17, 19, జూని యర్స్, సీనియర్స్ కేటగిరీలో అనేక పతకాలను సాధించాం. వరుసగా ఆరుసార్లు రాష్ట్రంలో అండర్-17 బాస్కెట్ బాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచాం. ప్రభుత్వాలు స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు చేసి చదువుతో పాటు క్రీడలపై తర్ఫీదు ఇవ్వాలి.

- భాగ్యలక్ష్మి , పీడీ, మున్సిపల్ బాలికల స్కూల్, నరసరావుపేట



చెకుముకి పోటీల్లో గోపన్నపాలెం విద్యార్థులు జిల్లా ఫస్ట్



దెందులూరు, అక్టోబరు 27 : (ఆంధ్రజ్యోతి) చెకుముకి సైన్స్ పోటీల్లో గోపన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా మొదటి స్థానం సాధించారు. ఏలూరులో జరిగిన సైన్స్ సంబరాల్లో భాగంగా జిల్లా స్థాయి చెక్‌ముకి పోటీల్లో పలు ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా దెందులూరు మండలం గోపన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హే మంత్ బాబు, కే.నితిన్ చక్రవర్తి, కే.సోహన్ సత్య కార్తీక్‌లు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు,

అండర్-17 వాలీబాల్ పోటీలకు గూటాల విద్యార్థి



పోలవరం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 పోటీలకు పోలవరం మండలం గూటాల పంచాయతీ మహాలక్ష్మీ దేవిపేట గ్రామా నికి చెందిన 9 వ తరగతి విద్యార్థి వేము లూరి కార్తీక్ ఎంపికయ్యాడు. ఉత్తర ప్రదేశ్‌లో ఈనెల 10వ తేదీ నుంచి నవంబరు 6 వరకు జరిగే ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు ఎంపికవడంతో ఆ గ్రామ పెద్దలు విద్యార్థిని అభినందించారు. హిందూపురంలో ఈ నెల 21న జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచి టోర్న మెంటుకి ఎంపి కైనట్టు తెలిపారు. కొవ్వూరు అవంతి ఫీడ్స్ ఎండీ అల్లూరి ఇంద్రకుమార్ గత వేసవిలో ఇచ్చిన వేసవి శిక్షణ ఎంతో ఉపయోగ పడిందని తల్లిదండ్రులు విజయ్ గౌతమి తెలిపారు. ఈ విజయంతో వైజాగ్ సాయి అకాడమీలో ఉచిత సీటు రావడం సంతోషాన్ని చ్చిందన్నారు.



బాస్కెట్‌బాల్ పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

జేఎన్టీయుకే సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ విజేత స్వర్ణాంధ్ర

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి) : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జేఎన్టీ యుకే సెంట్రల్ జోన్ మెన్ అండ్ ఉమెన్ బాస్కె ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయని కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. విజేతల వివరాలను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ క్రీడలు కమిటీ కన్వీనర్ డాక్టర్ సత్యనారా యణరాజు మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ పురు షుల విభాగంలో నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీ రింగ్ కళాశాల ప్రథమ స్థానం, గుంటూరు జిల్లా నంబూరు వీవీఐటీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలోనూ విజయం సాధించారు. తృతీయ స్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజ నీరింగ్ కళాశాల, గుంటూరు కెహెచ్‌ఐటీ కళాశా లకు సంయుక్తంగా దక్కింది. ఉమెన్ బాస్కెట్‌బాల్ విభాగంలో ప్రథమస్థానం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధించగా, ద్వితీయ స్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కళాశాలకు, గుంటూరు కెహెచ్‌ఐటీ కళాశాలకు సంయు క్తంగా దక్కింది. ఉమెన్ బాస్కెట్‌బాల్ విభా గంలో ప్రథమ స్థానం ఆదిత్య ఇంజనీరింగ్ కళా శాల విద్యార్థులు సాధించగా, ద్వితీయస్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, తృతీయస్థానంలో గుంటూరు సెంట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల, ఒంగోల్ క్యూఐపి కళాశా లకు సంయుక్తంగా దక్కింది. నెట్‌బాల్ మెన్ విభాగంలో ప్రథమస్థానం భీమవరం ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు, ద్వితీయస్థానం విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశా లకు, మూడోస్థానం సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళా శాలకు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల నిలిచాయి. విజేతలకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగ రాజు, ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు, జెఎన్టీయుకే ఇంటర్ కాలేజీయట్ టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ రాజు చేతుల మీదుగా బహుమ తులు అందించారు. రెండు రోజులు పాటు జరి గిన ఈ పోటీల్లో వివిధ కళాశాల ఫిజికల్ డైరె క్టర్స్ తదితరులు పాల్గొన్నారు.




ఏపీ నిట్‌లో మాట్లాడుతున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి.. గవర్నర్‌ను సన్మానిస్తున్న వలవల బాబ్జి

చదువుకు సాంకేతికత జోడిస్తే అద్భుతాలు

» త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మన చదువుకు సాంకేతికత జోడిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. తాడేపల్లి గూడెం ఏపీ నిట్ ఆడిటోరియంలో విద్యార్థులకు స్పందనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అకడమిక్ ఎచీవ్‌మెంట్ బూస్ట్ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో వెనుకబడ్డామన్నారు. వాటిని అధిగమించి మంచినీటిని వినియోగంలో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే త్రిపుర మూడో చిన్న రాష్ట్రం అయినా విద్యలో ముందుందన్నారు. స్పందనా ఫౌండేషన్ నిర్వాహకురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి, వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెద కృష్ణంరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, శశి విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర, పైడికొండల సింధు పాల్గొన్నారు.

● భీమవరం విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ఉన్నారు. గవర్నర్ మాట్లాడుతూ 40 ఏళ్లగా భీమవరం పరిసర ప్రాంతాల్లో సమాజ సేవలందిస్తున్న సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిని సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద అభినందించి సత్కరించారు.

విద్యతోనే అభివృద్ధి సాధించవచ్చు

భీమవరం రూరల్ : దొంగపిండి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడారు. విద్యతోనే అభివృద్ధి సాధించవచ్చని తీర ప్రాంతం నుంచి వచ్చిన శ్రీపూజ ఐఏఎస్ ర్యాంక్ సాధించిందని, జిల్లా కలెక్టర్ అవ్వడం ఈ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ గ్రామానికి తీసుకువచ్చిన ఆనంద గ్రూప్ ఛైర్మన్ భూపతిరాజు కాశీ విశ్వనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తుందుర్రులోని ఆక్వా ఫుడ్ పార్కును పరిశీలించారు. త్రిపుర ఫైనాన్స్ అండ్ ఐటీ మినిస్టర్ ప్రణదిత్ సింగరాయ్, తదితరులు పాల్గొన్నారు.


అడిషినల్ డీజీ చంద్రశేఖర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

చిన వెంకన్నకు అడిషినల్ డీజీ పూజలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని అడిషినల్ డీజీ (ఇంటిలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ) చంద్రశేఖర్ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు స్వామి వారి శేషవస్త్రాన్ని అందించి వేదాశీర్వచనం పలికారు. అధికారులు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.


నరసాపురం కనకదుర్గా థియేటర్ వద్ద మాట్లాడుతున్న హీరో ఉలిశెట్టి శ్రీనివాస్

'ఎంత పని చేసావ్ చంటి !' సినిమా యూనిట్ సందడి

నరసాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నరసాపురం ప్రాంతానికి చెందిన హీరో ఉలిశెట్టి శ్రీనివాస్ నటించిన 'ఎంత పని చేసావ్ చంటి' చిత్రం యూనిట్ ఆదివారం నరసాపురం కనకదుర్గా థియేటర్‌లో సందడి చేసింది. హీరో, హీరోయిన్లు నిహారిక, శాంతిప్రియ, డైరెక్టర్ ఉదయ్‌కిరణ్ కలిసి ఉదయం ఆటను సందర్శించారు. సినియా థియేటర్ వద్ద కేక్ కట్ చేశారు. తక్కువ బడ్జెట్‌తో తీసిన ఈ సినిమాను అభిమానులు ఆదరించడం ఎంతో సంతోషంగా ఉందని హీరో హీరోయిన్‌లు ఆనందం వ్యక్తం చేశారు. గోదావరి జిల్లాలో అన్ని థియేటర్లలో సినిమా మంచి కలెక్షన్లతో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో మైలా వసంతరావు, అడ్డాల శ్రీను, దివి సత్యన్, పోలిశెట్టి సాంబ, థియేటర్ నిర్వాహకులు నాని పాల్గొన్నారు.


రోడ్డుకు అడ్డంగా వేసిన కంచెను తొలగించిన అధికారులు

రోడ్డుకు అడ్డుగా వేసిన కంచె, రాళ్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 'సిమెంట్ రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక తెలుగుదేశం పార్టీల నేతల సహకారంతో రోడ్డుకు అడ్డంగా వేసిన ఇనుప కంచె, రాళ్లను తొలగించారు. ఈనెల 26న మండలంలోని తిమ్మాపురంలో రోడ్డును ఓ వైసీపీ నేత ఆక్రమించి ఇనుప కంచెను, రాళ్లను వేసి ప్రజల రాకపోకలను అడ్డుకుంటున్నట్లు కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు, పార్టీ నేతలు దగ్గరుండి తొలగింపజేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి 'దివాలీతో మై భారత్'

ఏలూరు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నెహ్రూ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 'దివాలీతో మై భారత్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నెహ్రూ కేంద్ర జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్ర సంఘటన్ న్యూఢిల్లీ వారి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, కాలేజీ విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు, సేవా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సోమవారం నుంచి 30వ తేదీ వరకు ఏలూరు నగరంలోని ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి పాతబస్టాండ్ వరకు ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమాలు, పత్తేబాద రైతు బజార్, వన్‌టౌన్ మార్కెట్, నిమ్మకాయల యార్డు ప్రాంతాల్లో శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద రోగులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.



భీమవరంలో భలే కేటుగాళ్లు

నమ్మించి నట్టేటముంచి ఐపీలు పెట్టి పరార్

» వడ్డీలకు ఆశపడితే అసలుకే మోసం » ఇటీవల పెరిగిన ఐపీల పర్వం

భీమవరం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారం చేసేందుకనో, బిల్డింగ్ నిర్మాణం కోసమని, పొలం, ఆస్తులు కొనుగోలు చేసేందుకు అని రకరకాల కారణాలు చెప్పి డబ్బులను అప్పుగా తీసుకుంటారు. అప్పు ఇచ్చినవారికి తెలిసేలా కొన్ని ఆస్తులు కూడా కొనుగోలు చేస్తారు. నెలనెలా వడ్డీ సొమ్ముకు క్రమపద్ధతిలో కట్టేస్తారు. అక్కడ వరకు బాగానే ఉన్న ఆస్తులు విక్రయించేటప్పుడు రెండో కంటికి తెలియకుండా విక్రయిస్తారు. అప్పు ఇచ్చిన వ్యక్తి అతడికి స్థిర ఆస్తులు ఉన్నాయిలే అనుకుంటాడు. అక్కడ మొదలవుతుంది ట్విస్ట్ నెలనెలా వడ్డీలు జమ కావు. ప్రశ్నిస్తే వ్యాపారాలు సరిగా లేవు, ఆస్తులు ఉన్నాయి కదా భయపడతారెందుకు అని కొంత కాలం గడిచిన తరువాత రాత్రికి రాత్రే పరారవుతారు. కొన్ని రోజుల తరువాత ఇన్‌సాల్వెన్సీ పిటీషన్ (ఐపీ) నోటీసులు పంపిస్తారు.

భీమవరం పట్టణంలో ఇటీవల ఇటువంటి ఘటనలు కోకొల్లలుగా బయటపడుతున్నాయి. గత పదేళ్ల నుంచి రొయ్యలు, చేపల రైతులకు దళారులు కోట్ల రూపాయల్లో ఎగనామం పెడుతున్నారు. వడ్డీలకు ఆశపడితే అసలుకే మోసం ఏర్పడుతుంది. ఈవిధంగా రొయ్య, చేపల రైతులు చాలామంది రోడ్డున పడ్డారు. మళ్లీ కొద్దికాలంగా ఐపీల పర్వం భీమవరంలో సంచలనం రేకెత్తిస్తున్నాయి.

మావుళ్ళమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఒక టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు కొంతమంది వద్ద సుమారు రూ.2 కోట్లు వరకు అప్పుగా తీసుకుని కొంతకాలం వడ్డీ చెల్లించాడు. అనంతరం వడ్డీలు చెల్లించలేకపోవడంతో అప్పిచ్చినవారు ఒత్తిడి తేవడంతో రాత్రికి రాత్రే సామగ్రి సదురుకుని కుటుంబంతో సహా పరారయ్యాడు.

బస్టాండ్ రోడ్డులో ఉన్న ఒక బజ్జీల వ్యాపారి అందరిని నమ్మించి సుమారు రూ.2 కోట్లు వరకు అప్పులు తీసుకున్నాడు. తీరా ఎగనామం పెట్టి పరారై అనంతరం ఐపీ నోటీసులు పంపించాడు.

సుమారు రెండు నెలల క్రితం చేపల మార్కెట్ ప్రాంతానికి చెందిన వ్యక్తి కోటిన్నర అప్పులు చేసి చెల్లించలేక ఒత్తిడి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మెయిన్ రోడ్‌కు చెందిన ఒక వ్యాపారి కోటిన్నర వరకు అప్పులు చేసి అప్పు ఇచ్చినవారు అడుగుతూ ఉండటంతో కొంతకాలం వేరే ఊరువెళ్ళి మళ్ళీ వచ్చాడు. మళ్ళీ ఒత్తిడి రావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఏడాదిన్నర క్రితం మావుళ్ళమ్మ గుడి సమీపంలోని బట్టల వ్యాపారి నమ్మకంగా చీటీల వ్యాపారం చేసేవాడు. ఎవ్వరికి పాట ఇవ్వకుండా ఒకరు అడిగితే మరొకరి ఇచ్చానంటూ నమ్మబలికాడు. రూ.4 కోట్ల వరకు అప్పులు చేసి రాత్రికి రాత్రే కుటుంబంతో సహ పరారై అందరికీ ఐపీ నోటీసులు పంపించాడు.

అప్పు ఇచ్చి భారీగా నష్టపోయా..

ఓ వ్యక్తిని నమ్మి చాలా సొమ్ములు నష్టపోయా. చీటీలు వేశాను. నమ్మించి నెల నెలా ముందుగా వడ్డీలు చెల్లించి నమ్మకం కలిగించాడు. రెండేళ్ల తరువాత రాత్రికిరాత్రే కుటుంబంతో వెళ్ళిపోయాడు. నెల తరువాత ఐపీ నోటీసులు పంపించాడు.

- ఎన్. సత్యనారాయణ, భీమవరం

అప్పులు ఇచ్చేవారు అప్రమత్తంగా ఉండాలి



ఇటీవల కాలంలో బాకీలు ఎగ్గొట్టి పరారయ్యేవారు ఎక్కువయారు. అప్పులు ఇచ్చేవారు అప్రమత్తంగా ఉండాలి. అవతలి వారి స్థితిగతులు చూసి అప్పులు ఇవ్వాలి. అప్పులు తీసుకోవడం అవి తీర్చకుండా ఐపీలు పెట్టేవారు కొందరైతే మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చాలామంది అజాగ్రత్తల వల్ల నష్టపోతున్నారు.

- జి.కాళీచరణ్
సీఐ, భీమవరం టూటౌన్

క్రైమ్ కార్నర్

మద్యం మత్తులో ఒకరి హత్య

» ముగ్గురి మధ్య వివాదం.. పోలీసుల అదుపులో ఒకరు, మరొకరు పరారీ


రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్‌లో) మృతదేహం

మొగల్తూరు, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తుల మధ్య వివాదాలు చెలరేగడంతో ఓ వ్యక్తి హత్యకు గురైనట్టు మొగల్తూరు ఎస్.ఐ జి.వాసు తెలిపారు. మొగల్తూరు మండలం మోడి గ్రామానికి చెందిన మారెళ్ళ రాంబాబు (48) శనివారం రాత్రి మద్యం సేవించేందుకు ముత్యాలపల్లి గ్రామానికి వెళ్లాడు. మద్యం సేవించి వస్తుండగా మోడి సెంటర్‌లో రామాలయ పునఃనిర్మాణ సమావేశం జరుగుతోంది. ఇదే సమయంలో అక్కడికు వచ్చిన రాంబాబుకు అదే గ్రామానికి చెందిన జడ్డ నాయుడు, కొత్తకాయలతిప్పకు చెందిన ఉంగరాల వీరన్న మధ్య వివాదం నెలకొంది. ఆవేశానికి గురైన నాయుడు, వీరన్న రాంబాబును కొట్టడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి తమకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య వెంకట కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో జడ్డ నాయుడు పరారీలో ఉండగా ఉంగరాల వీరన్న తమ అదుపులో ఉన్నట్టు ఎస్ఐ వివరించారు.


వ్యాపారి చంటి.. కాలిపై గాయం..

వీధి కుక్క దాడిలో వ్యాపారికి గాయాలు

పోలవరం, అక్టోబరు 27 ఆంధ్రజ్యోతి : వీధి కుక్క దాడిలో ఆకుకూరల వ్యాపారి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. బాధితుడు పోలుమాటి చంటి ఆకు కూరలు అమ్ముకోవడానికి సైకిల్‌పై బెస్తావీధిలో వెళ్తుండగా ఒక ముస్లిం కుటుంబానికి చెందిన పెంపుడు ఊరకుక్క దాడి చేసి రెండుసార్లు కాలుపై కరిచిందని తెలిపారు. ఆ వీధిలో అదే కుక్క గడిచిన నెలరోజులలో ఏడుగురిని కరిచిందని ఆ విషయంపై యజమానిని నిలదీస్తే తనకు సంబంధం లేదని పంచాయతీలో ఫిర్యాదు చేసుకోమన్నారని ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా కొన్ని రోజుల క్రితం గ్రామంలో వీధికుక్కలను పట్టించి దూరంగా వదిలి పెట్టామన్నారు.

ఆకివీడులో యాచకుడి మృతి

ఆకివీడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు రైల్వేస్టేషన్ బయట ఓ యాచకుడు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ హనుమంతు నాగరాజు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి శవపంచనామాకు భీమవరం తరలించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆరుబయట, రైల్వే బోగీలలో చెత్త వేరుకొంటూ కొంతకాలంగా యాచకుడిగా యువకుడు (35) జీవనం సాగిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. రెండు రోజులనుంచి జ్వరంతో బాధపడుతూ చనిపోయినట్టు తోటి యాచకులు చెబుతున్నారు. శవ పంచనామా అనంతరం మున్సిపాల్టీ కార్మికులతో ఖననం చేయిస్తామని ఎస్ఐ తెలిపారు.

బెల్టుషాపుపై దాడి

» 190 బాటిళ్లు స్వాధీనం
» ఒకరి అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాలగూడెం పంచాయతీ పరిధిలో కొమడవోలుకు చెందిన గోవాడ గంగయ్య బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌కు సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో ఆదివారం దాడి చేసి అతడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 190 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చీటింగ్ కేసు నమోదు

» మెడికల్ డీలర్‌షిప్ పేరుతో రూ.1.35 లక్షలు స్వాహా

ఏలూరు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసగించడంతో ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు శాంతినగర్, 8వ రోడ్డులో నివాసం ఉంటున్న కోనా ధనవెంకట సత్యనారాయణ వ్యాపారం పెట్టే ఆలోచనలో ఉండగా అమరావతి రాజేష్ అనే వ్యక్తి ఫోన్‌లో పరిచయమై మెడికల్ ఏజన్సీ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని ఆ డీలర్‌షిప్ పాయింట్ తీసుకోవాలంటే లక్షా 35 వేల రూపాయలు సొమ్ములు చెల్లించాలని తమ వద్దే అన్ని మందులు కొనుగోలు చేయాలని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన వెంకట సత్యనారాయణ లక్షా 35 వేల రూపాయలు చెల్లించాడు. ఆ సొమ్ము తిరిగి ఇవ్వడంలేదు. ఫోన్ స్విచ్ ఆపేశాడు. ఈమేరకు బాధితుడు ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

పెంటపాడు , అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై ప్రయాణం చేస్తున్న దంపతులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి మూడు కాసుల బంగారు గొలుసు అపహరించిన ఘటన శనివారం రాత్రి ముదునూరు గ్రామం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం పట్టణం గణేష్ నగర్‌కు చెందిన దంపతులు గంగుల నాగరాజు, సత్యవతి శనివారం భీమవరంలో వారి బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహ శుభకార్యానికి హాజరయ్యారు. అదే రోజు రాత్రి పదకొండు గంటల సమయంలో తాడేపల్లిగూడెం బైక్‌పై వస్తుండంగా పెంటపాడు మండలం ముదునూరు వచ్చేసరికి మరో బైక్‌పై గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఆమె మెడలో బంగారు గొలుసును లాగేశారు. బైక్ అదుపుతప్పడంతో భార్యాభర్తలు ఇద్దరూ కింద పడిపోయారు. సమాచారం తెలుసుకున్న పెంటపాడు ఎస్ఐ స్వామి ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 వాహనంపై వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దారి దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

తణుకు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తణుకులో కత్తితో బెదిరించి దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాసు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ రాత్రి ఇరగవరం నుంచి తణుకు వైపు వెళుతున్న లారీలను ముగ్గురు వ్యక్తులు ఇరగవరం కాలనీ వద్ద ఆపి డ్రైవర్లను డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదించినట్లు చెప్పారు. ఒక లారీ డ్రైవర్‌ను గాయపర్చి ఆయన జేబులో ఉన్న రూ.వెయ్యి లాక్కొని పారిపోయినట్టు తెలిపారు. గాయాలైన బాధితుడు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తణుకు, పాతూరు, ఇరగవరం కాలనీలకు చెందిన కొల్లాటి రత్నకుమార్, సరాకుల సురేష్, తుంపాల కన్నబాబులను నిందితులుగా గుర్తించి నట్టు ఎస్ఐ వివరించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు చెప్పారు.

రెస్టారెంట్‌పై అల్లరి మూకల దాడి

ఏలూరు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పూటుగా మద్యం తాగిన ఆరుగురు యువకులు ఒక రెస్టారెంట్‌లోకి వెళ్లి తిని ఆపై ఆకస్మాత్తుగా రెస్టారెంట్ సిబ్బందిపై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి సమీపంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఫుడ్ ఇంజనీర్ రెస్టారెంట్‌కు ఆదివారం సాయంత్రం రెండు మోటారు సైకిళ్లపై ఆరుగురు యువకులు వచ్చారు. పూటుగా తిన్నారు. ఆ తరువాత రెస్టారెంట్ సిబ్బంది బిల్లు అడగడంతో అకస్మాత్తుగా సర్వర్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న క్యాష్ కౌంటర్ వద్ద మహిళలపై కూడా దాడికి పాల్పడ్డారు. అనంతరం రెస్టారెంట్‌లోని టీవీ, ఫర్నీచర్ ధ్వంసం చేసి హడావుడి సృష్టించి వెళ్ళిపోయారు. ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శంకర్ మఠానికి చెందిన అల్లరి మూకలుగా ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఏలూరు నగరంలోనే అల్లరి మూకలు ఇలా రెచ్చిపోతున్నాయంటే ఇక పోలీసు ఉన్నతాధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏలూరు టూటౌన్ పోలీసులు

వేర్వేరు చోట్ల 27 మంది జూదరుల అరెస్ట్

దెందులూరు,అక్టోబరు 27 : (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో వేర్వేరు చోట్ల మొత్తం 27 మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఆయా పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి అరెస్ట్ చేశారు. దెందులూరు మండలం కొవ్వలి దళితపేటలో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.24,330 స్వాధీనం చేసుకున్నామన్నారు.

టి.నరసాపురంలో ఆరుగురు..

టి.నరసాపురం : పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఏఎస్ఐ వి.జయకుమార్ తెలిపారు. టి.నరసాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గురవాయిగూడెంలో ఐదుగురు..

జంగారెడ్డిగూడెం :గురవాయిగూడెంలో పేకాట స్థావరంపై లక్కవరం పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాటాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.14,330 నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

జంగారెడ్డిగూడెంలో తొమ్మిది మంది..

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని గరుడ పక్షి నగర్ పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2200 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానిక ప్రతిభ పాఠశాల సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7300 నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కె.జబీర్ తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడులు

» 22 మంది అరెస్ట్

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసపురం గ్రామ సమీపంలో ఆదివారం కోడిపందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ ఎస్‌కె జబీర్ తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి ఒక కోడికత్తి, ఒక కోడిపుంజు రూ.48వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పెదరావిగూడెంలో ముగ్గురు..

కుక్కునూరు : పెదరావిగూడెం గ్రామంలో ఆదివారం కోడి పదేల స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారి వద్ద వున్న కోడి పుంజులు, ర.3,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బాపిరాజుగూడెం సమీపంలో ఐదుగురు..

పెదవేగి : బాపిరాజుగూడెం సమీపంలోని తోటల్లో కోడి పందేలు వేస్తున్నారనే సమాచారంతో దాడి చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, ఒక పందెం కోడితో పాటు రూ.11,400 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

నరసింగపాలెంలో ఐదుగురు..

ఆగిరిపల్లి : నరసింగపాలెం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అల్లూరులో ఇద్దరు..

ముదినేపల్లి : అల్లూరు గ్రామంలో ఆదివారం కోడి పందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2 వేలు నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నామన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛ భారత్

నూజివీడుటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలోని బ్యాక్ బిల్డింగ్ ఇతర ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు పారిశుధ్యం మెరుగుదల కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రావణి కనకకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు వి.తులసి, జి.నిరంజనితో పాటు 200 మంది వలంటీర్లు పాల్గొన్నారు.

ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీ

» చిన్నారితో సహా ఒకరికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్ప గాయాలు

గోపాలపురం, అక్టోబరు 27: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో తండ్రికి కుడి కాలు, కుమార్తెకు కుడికాలు తుంటిభాగం విరిగిన ఘటన మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. మండలంలోని కరిచర్లగూడెం గ్రామానికి చెందిన రాయి రాజశేఖర్ కొయ్యలగూడెం మండలం అచ్యుతపురం గ్రామంలో తన అత్తారింటి వద్ద ఉన్న కుమార్తె కుమారులు అక్షయ, మధుకిరణ్‌ను తీసుకుని రావడానికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో జగన్నాథపురం శివారుకు వచ్చేసరికి గోపాలపురం వైపు నుంచి జంగారెడ్డిగూడెం వైపు స్కూటీపై వస్తున్న వ్యక్తి వాహనాలు ఎదురెదు రుగా ఢీకొన్నాయి. స్థానికుల సాయంతో రాజశేఖర్ తోపాటు కుమార్తె, కుమారులను 108 వాహనంలో కొయ్యలగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా గాయాలపాలైన మరో వ్యక్తిని మరో 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. స్థానికుల సమాచారంతో ఘటన ప్రదేశంలో ఉన్న రెండు బైక్‌లను గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


కొయ్యలగూడెం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాయి రాజశేఖర్

రోడ్డుపైనే చేపల విక్రయాలు

ట్రాఫిక్ జామ్‌తో ప్రజల పాట్లు

పోలవరం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలవరం పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉన్న బాపూజీ కాలనీ సీసీ రోడ్లపై చేపల వ్యాపారులు అమ్మకాలు చేస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీంతో వాహనదారులు ఆదివారం ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. పోలవరం మార్కెట్‌లో చేపలు మాంసం అమ్మకాల కోసం ప్రత్యేకంగా లక్షలాది రూపాయలతో షెడ్లు నిర్మించినప్పటికీ చేపల వ్యాపారులు నిత్యం రోడ్డుపై చేపల అమ్మకాలు చేస్తుంటారు. దీని వలన ఆ రోడ్డుపై ట్రాఫిక్ తరచూ జాం అవుతూ ఇబ్బందులకు పడుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్ రోడ్డుపై చేపల విక్రయాలు

ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



గ్యాస్ కనెక్షన్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, నాయకులు

జీలుగుమిల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వికసీత భారత్‌లో భాగంగా పీఎం ఉజ్వల యోజన (పీఎంయువై)పథకంలో పేద కుటుంబాలకు చెందిన మహిళకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. అర్హులైన 110 మందికి గ్యాస్ కనెక్షన్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ఫైదా దుర్గ, జగదీష్ జనసే నాయకులు గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము ఉన్నారు.

రూ.60 లక్షల నిధులు మంజూరు

పోలవరం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో డ్వాక్రా మహిళల ఆరికాభివృద్ధి కోసం స్వయం ఉపాధి కోసం పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ల స్థాపనకు రూ.60 లక్షలు మంజూరైనట్లు ఏపీఎం జేమ్స్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్ ప్లేట్ల తయారీపై వింజరం పంచాయతీలో శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో నాలుగు యూనిట్లు మంజూరయ్యాయని ఒక్కో యూనిట్‌కి రూ.15 లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ పరీక్షార్థులకు ఉచిత శిక్షణ


ఏలూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దెందులూరు నియోజకవర్గానికి చెందిన మెగా డీఎస్సీ-2024 అభ్యర్థులకు వంద రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. నవంబరు మూడు నుంచి స్థానిక కేపీడీటీ హైస్కూలు ఆడిటోరియంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ తో పాటు, భోజన సౌకర్యాలను ఉచితంగానే కల్పిస్తామన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ నిపుణులతో డీఎస్సీ పరీక్షార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నవంబరు 3న శిక్షణ శిబిరాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి తదితరులు ప్రారంభిస్తారన్నారు. శిక్షణ శిబిరం నిర్వహణకు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్, స్కూలు కరస్పాండెంట్ హరగోపాల్‌లునాని సహకరిస్తున్నారని ఎమ్మెల్యే ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం వి.మురళీకృష్ణ, ప్రసాదరాజు, మానసిక వికాస నిపుణులు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు బొప్పన సుధ, నంబూరి నాగరాజు, ఉప్పలపాటి రాంప్రసాద్, నేతల రవి, గుత్తా అనీల్, మండపాటి వెంకటేశ్వరరావు, శిక్షణ శిబిరం నిర్వాహకులు సురేష్, కడియాల కృష్ణారావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు వి.నరసింహారావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అభ్యర్థులకు పరీక్షల సామగ్రిని అందజేశారు.



డీఎస్సీ అభ్యర్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, తదితరులు

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

నిడమర్రు అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. పెద నింద్రకొలనులోని భీమేశ్వరస్వామి దేవస్థానం, వేణుగోపాల స్వామి దేవస్థానాలకు నూతన పాలక వర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారం ఆదివారం వైభవంగా నిర్వహించారు. భీమేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా మేకా వెంకటరమణ, సభ్యులుగా లంకా లలిత, కొంచాడ అప్పన్న, గొర్ల గోపి, అల్లూరి సత్తిరాజు, తుమ్మూరి శ్రీరాములు, వేణుగోపాల స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా ఉదయగిరి లక్ష్మీ వీర వెంకట వెంకటేశ్వరరావు సభ్యులుగా గోపిశెట్టి శ్రీను, పసర్లపూడి దుర్గాభవాని, శీలంశెట్టి రమణ, బాతు కిషోర్‌కుమార్, అన్నెంరెడ్డి కనకరాజు ప్రమాణ స్వీకారం చేశారు. గన్ని వీరాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు. జనసేన, టీడీపీ నాయకులు వి.రఘు, పి.భీమరాజు నాయీ బ్రహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.రాంబాబు, పి.సింహచలం, ఈవో బి.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గన్ని

జంగారెడ్డిగూడెం అభివృద్ధికి రూ.4.65 కోట్లు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలో తాగునీరు, రహదారుల అభివృద్ధి పనులకు రూ.4.65 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ప్రతిపాదనల ఫైల్‌ను ఆదివారం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని మున్సిపాల్టీల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మున్సిపాల్టీ ఆదాయం పెంచటం, వాటి పనితీరు మెరుగు పరచటం ద్వారా పట్టణ అభివృద్ధికి మరింత తోడ్పడతామన్నారు. త్వరలో సీఎం చంద్రబాబుని కలిసి పట్టణ సుందరీ కరణ కోసం నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈనెల 29వ తేదీన రూ.4.65 కోట్లకు జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించనుందని కమిషనర్ రమణ ఎమ్మెల్యేకు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, టీడీపీ, పట్టణ ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ పాల్గొన్నారు.



వివరాలను ఎమ్మెల్యేకు అందచేస్తున్న కమిషనర్

మానవసేవే మాధవసేవ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఏలూరురూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవ సేవ అనే సంకల్పంతో సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నట్లు సంకల్పం ట్రస్ట్ ఛైర్మన్ ఎ.జయశ్రీ అన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్లూరు గౌతమి నగర్‌లో నిరుపేదలకు, పారిశుధ్య కార్మికులకు వంద మందికి నిత్యావసరాలు ఆమె చేతులమీదుగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో ట్రస్ట్‌ను ప్రారంభించి నిరుపేదల సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే ఉదయం విజయవాడ సింగ్‌నగర్‌లో వరద బాధితులు 300 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు జయశ్రీ తెలిపారు. జి.సతీష్, దుర్గాప్రసాద్, హరిరాజు పాల్గొన్నారు.

చర్చ్ ఆధునికీకరణ



చర్చ్ సెంట్రల్ ఏసీని ప్రారంభిస్తున్న పరదేశిబాబు

ఏలూరురూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): స్థానిక అమీనాపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ ఆధునికీకరణ, సెంట్రల్ ఏసీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా మోస్ట్ రెవరెండ్ డాక్టర్ కేఎఫ్ పరదేశిబాబు, మోడరేటర్ బిషప్ గుంటూరు, ఏఈఎల్‌సీ, అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు తదితరులు చేతులమీదుగా ప్రారంభించారు. ఆశా కిరణ్, పరదేశిబాబు, రవితేజ, ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్, విద్యుత్ శాఖ ఏఈ అంబేడ్కర్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు పాల్గొన్నారు. తొలుత చర్చ్ ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చ్ విశ్వాసకులు, సంఘస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏలూరురూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పంచాయతీరాజ్ డిప్లమా, ఇంజినీర్ల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో 2024-27కి గాను సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.బాలాజీబోసుబాబు, ఫైనాన్స్ కార్యదర్శిగా కేటీవీఎస్ఎన్ జగన్నాథరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఐవీకే విశ్వనాథరాజు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా ఆర్.వీరబాబు వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీకృష్ణ, సంఘం ప్రాథమిక సభ్యులు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

పొగాకు పనివార్లకు స్థలాలు, ఇళ్లు నిర్మించాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు అత్తులూరి సర్వేశ్వరరావు స్థాపించిన ఏఐటీయూసీ అనుబంధ పొగాకు పనివార్ల సంఘంలో ఉన్న కార్మికులకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కోశాధికారి వి.కన్నబాబు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం జరిగిన పొగాకు పనివార్ల సంఘం జనరల్ బాడీ సమావేశానికి యూనియన్ నాయకులు గోళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఇటీవలే మరణించిన యూనియన్ అధ్యక్షుడు జోగి నాగేశ్వరరావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. నాగేశ్వరరావు స్థానంలో అధ్యక్షుడిగా బి.పోతురాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కన్నబాబు మాట్లాడుతూ పొగాకు పనివారికి 50 ఏళ్ల పూర్తికాగానే పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసడాంగే, ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సీహెచ్ కుర్మారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్నబాబు

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఏలూరు మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ ఆదివారం జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. 2025కి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.సురేష్‌బాబు, అధ్యక్షులుగా ఎస్‌కేవీఎస్ మణి, సహ అధ్యక్షులుగా పి.ముకుంద లక్ష్మి, డి.పూర్ణశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.కనకదుర్గ, కోశాధికారి ఎ.స్వర్ణలత, కార్యదర్శులుగా పీవీ జనార్దన్‌రావు, టీఈఎన్‌డీ ప్రసాద్, వహీదా బేగం, సత్య సౌమ్య, చిన్ని కృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, పి.ప్రసన్నకుమార్, జిల్లా కౌన్సిలర్స్‌గా ఎస్‌కే పోరాఖాన్, ఓపీ, ధనుంజయ్‌రావు, మాధవిలత, ఎన్.రామారావు, శ్యామలతో పాటు మరో 30 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, నాయకులు సుభానీబేగం, బి.మోహన్‌రావు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

గోతులు పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొయ్యలగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్లాడ, దేవరపల్లి హైవేపై కొయ్యలగూడెం మండలం పరిధిలో పడిన గోతులను ఎట్టకేలకు పూడ్చారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ఈ గోతులపై వార్త రావడంతో అధికారులు స్పందించి గోతులను పూడ్చారు.



టీడీపీ సభ్యత్వ నమోదు

కామవరపుకోట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మండ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. టీడీపీ సభ్యత్వాన్ని తీసుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. కొండగూడెం, తదితర గ్రామాల్లో మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, రామన్నపాలెంలో మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు బృందం సభ్యత్వ నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకుల సందడి నెలకొంది.

రాయితీపై కందిపప్పు, పంచదార

పోలవరం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నవంబరు ఒకటి నుంచి తెల్ల రేషనుకార్డుదారులకు ఉచిత బియ్యం రాయితీపై పంచదార కందిపప్పు పంపిణీకి సిద్ధంగా చేసినట్లు తహసీల్దారు బి.సాయిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న 14,700 రేషన్ కార్డుదారులకు నూరు శాతం ఇవ్వనున్నట్లు తెలిపారు. 2,191 క్వింటాళ్ళ బియ్యం, 69.64 క్వింటాళ్ళు పంచదార, 14,700 కిలోల కందిపప్పు రేషన్ సిద్ధం చేసినట్లు అరకిలో పంచదార రూ.17లకు, కందిపప్పు కిలో రూ.67లకు అందుబాటులో ఉందన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తాం

ఉంగుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని రాష్ట్ర విస్తరణ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఎస్.జానకిరామరాజు పేర్కొన్నారు. నారాయణపురంలో ఆదివారం మండల మానవత సమావేశం ఎ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శి జి.రవికుమార్, ఎస్.సత్యనారాయణ, బి.అప్పారావు, జి.రాజారావు, వి.సూర్యనారాయణరాజు, కె.సత్యనారాయణ, పి.శ్రీను, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వన మహోత్సవం



పోలవరం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొత్తపట్టిసీమ పోలవరం, కొత్త రామయ్యపేట సచివాలయాలలో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ ట్రైబల్ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎంపీడీవో ఇ.శ్రీనివాస్, కూటమి నాయకులు జి.చిన్ని, కె.ప్రసాద్ , పి.శ్రీనివాస్ , ఎ.రాధయ్య, పి.శ్రీనివాస్, సర్పంచ్ పి.పుష్ప, పంచాయతీ సిబ్బంది కొండలరావు, కొత్తపట్టి సీమ సర్పంచ్ ఎం.విజయదుర్గ, కార్యదర్శి టి.విజయ కుమారి, సచివాలయ, పంచాయతీ, అంగన్వాడీ, హెల్త్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

ఏలూరు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదని జిల్లా పోలీస్ అధికారులు రౌడీషీటర్లకు హెచ్చరిక జారీ చేశారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఆదివారం సంబంధిత ప్రాంత రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరైనా రౌడీ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, టూ టౌన్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం : రౌడీషీట్, సస్పెక్ట్ షీట్ ఉన్న వారు సత్ప్రవర్తనతో ఉండాలని, జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వారికి సీఐ కృష్ణబాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమస్యలు సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి తప్పుడు చేయమని పోలీస్ అధికారులకు,రౌడీ షీటర్‌లు, సస్పెక్ట్ షీట్‌లు ఉన్న వారు హామీ ఇచ్చినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏలూరు వన్ టౌన్ సీఐ

వృద్ధులకు సాయం

ఏలూరురూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): స్థానిక పత్తేబాదు రైతుబజారు సమీపంలో ఉన్న నిశ్చింత వృద్ధాశ్రమంలో బీజేపీ నాయకులు సీతారామన్ ఆయన తండ్రి జ్ఞాపకార్థం ఆశ్రమంలోని వృద్ధ మహిళలకు చీరలు, దివ్యాంగులు నడిచేందుకు స్టాండ్లు, చేతికర్రలు ఆదివారం పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగం శివ, బర్మా లక్ష్మణరావు, కుసుమకుమార్, భానుమూర్తి పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌తో జీర్ణకోశ సమస్యలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోషక విలువలు లేని జంక్ ఫుడ్స్ వల్ల ఇటీవల జీర్ణ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండం ఆందోళన కలిగిస్తోందని స్థానిక ఆయుష్ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ డి.వెంకట జయదీప్ అన్నారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ మండలంలోని శ్రీపర్రు గ్రామ పంచాయతీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 135 మంది రోగులకు బీపీ, మధుమేహం, ఈసీజీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయుష్ హాస్పిటల్ మేనేజర్ కాశీనాథ్ జాస్తి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జయదీప్ మాట్లాడుతూ రోగులకు పలు సూచనలు చేశారు. మాంసాహా రాన్ని మితంగా తీసుకో వాలని, ముఖ్యంగా ఆకు కూరలు, పచ్చని కూరగాయలు, గుడ్లు, తాజా పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలని కోరారు. కొవ్వు అధికంగా ఉండే బేకరీ ఫుడ్స్, రెడ్ మీట్, స్వీట్స్‌కు దూరంగా ఉండటమే మేలన్నా రు. పీచు పదార్థం ఉండే ఆహారంవల్ల జీర్ణ ప్రక్రియ సులువుగా ఉంటుందని వివరించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భానుకిరణ్ మాట్లా డుతూ కామెర్లకు గురైన వ్యక్తులు సరైన ఆహార నియమాలు పాటించాలన్నారు. గ్రామ పెద్దలు ఘంటసాల శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యులు, గ్రామ పెద్దలు

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తాం'

ఏలూరు రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులు పోటీ చేయనున్నట్లు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్, ప్రముఖ సామాజికవేత్త, హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా యాదవ సంఘం భవనంలో ఆదివారం బహుజన రాజకీయ పార్టీల, సంస్థల ప్రతినిధులు, ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బహుజన రాజకీయ శక్తులు ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు.బీసీ కులాల జేఏసీ అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ పెరియార్, యు.గోపాలకృష్ణ, కె.వేణుగోపాలకృష్ణ, కె.నరసింహారావు, ఎస్.నాగమణి పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

పెదవేగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రంథ పఠనం విజ్ఞానదాయకమని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు టి. అరుణ్ కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివారు.

రెవెన్యూ సిబ్బందికి అదనపు బాధ్యతలు

పోలవరం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది బదిలీలపై వెళ్లడంతో సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తహసీల్దారు బి.సాయిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ ఎం.భీమరాజుకి పోలవరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, పోలవరం గ్రామ రెవెన్యూ అధికారి వై.గాంధీకి పోలవరం-2 రెవెన్యూ అధికారిగా, ఎల్లండిపేట గ్రామ రెవెన్యూ అధికారి ఎం.ఆకాష్‌రాజుకి కొండ్రుకోట గ్రామ రెవెన్యూ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర్వులు శనివారం నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు.

గుంటూరులో మాలల మహాగర్జన

ఏలూరురూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరు నాగార్జునా యూనివర్శిటీలో నవంబరు 28న జరిగే మహా గర్జనకు తరలిరావాలని మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు ఎ.రవికుమార్ పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మాలలు కృషి చేశారని గుర్తించాలన్నారు. మాలల అభిప్రాయాన్ని గౌరవించాలన్నారు. వర్గీకరణ వద్దని పేర్కొన్నారు. యు.దేవిప్రసాద్, జి.విజయ్, కె.కోటిదిలీప్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

లింగపాలెం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా వుండాలంటే సరైన ఆహారం తీసుకోవాలని డాక్టర్ శృతి అన్నారు. కలరాయన గూడెంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆంధ్ర హాస్పటల్ వైద్యులు శృతి, స్వరూప్‌రెడ్డి, రమేష్ రోగులను పరీక్షించారు. ఎన్.సీతారామతిలక్, ఎం.గంగాధర్, రాంబాబు, వరప్రసాద్, ఎన్. శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు

లింగపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకన్న హెచ్చరించారు. లైసెన్సు ఉన్న వారు మాత్రమే బాణసంచా విక్రయించాలన్నారు. బాణసంచా తయారీ, సరఫరా, విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఆధ్యాత్మికం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు రాట్నాలకుంట రాట్నాలమ్మను ఆదివారం దర్శించుకుని, పూజలు జరిపారు. పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.54,710లు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.26,190లు, ఫోటో విక్రయాల ద్వారా రూ.3515లు ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి భక్తులు రూ.26,978లు విరాళాలు అందించారని ఈవో చెప్పారు.

గంగానమ్మ సంబరాలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపేట, నవాబ్‌పేటలోని గంగానమ్మ ఆలయాల వద్ద ఆదివారం అమ్మవారి వార్షిక సంబరాలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పవరుపేటలోని గంగానమ్మ ఆలయం వద్ద అమ్మవారికి 108 పసుపు నీటి బిందెలతో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బృందం స్నానోత్సవాన్ని నిర్వహించారు. బాలాజీ థియేటర్ సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో అయ్యప్ప అన్నదానోత్సవ కమిటీ ఆధ్వర్యంలో టి.ప్రసాద్ గురుస్వామిచే పడి పూజ, భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రం వద్ద అయ్యప్పస్వాములకు నిత్య భిక్షా కార్యక్రమాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు.

108 వెండి తమల పాకులు సమర్పణ

పెదపాడు : అప్పనవీడులోని అభయాంజనేయస్వామికి కొత్తగూడెంకి చెందిన పి.లక్ష్మణరావు, రేవతికుమారి 108 వెండి తమల పాకుల దండను ఆదివారం సమర్పించారు. ఈవో కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ



సభ్యత్వ నమోదు చేస్తున్న నరేష్

కొయ్యలగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా టీడీపీ ఉంటుందని మండల టీడీపీ అధ్యక్షుడు పి.నరేష్ అన్నారు. సిరిపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. మండలంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేయించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. గ్రామ అధ్యక్షుడు కె.రామచంద్రం, ఎ.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

104 డ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): 104 డ్రైవర్లకు సక్రమంగా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఎంఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 104 డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ సమస్య పరిష్కరించాలని ప్రకాష్ అన్నారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.విజయ్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు రైతుల మెడకు ఉరితాళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జీలుగుమిల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పంపు సెట్ల మీటర్లు రైతుల మెడకు ఉరి తాళ్లని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. జీలుగుమిల్లిలో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏపీ రైతు సంఘం సమావేశం ఆదివారం జరిగింది. కేంద్రం విద్యుత్ ప్రవేటీకరణ కోసం ప్రవేశపెట్టిందన్నారు. ఆ బిల్లులో ఉచిత విద్యుత్తు అమలు చేసే వీలు లేదన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయటం తగదన్నారు. నాయకులు టి.సూర్యారావు, ఎస్.శేషగిరిరావు, డి.రామారావు, వై.నరసింహారావు ఉన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కైకలూరు మండలంలో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై మండల స్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించేందుకు సోమవారం ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీ డీవో తెలిపారు. ఇటీవల మండలంలోని గ్రామాల్లో జరిగిన సామా జిక తనిఖీలపై కూడా ఈ ప్రజా వేదికలో చర్చిస్తామన్నారు.

రేపు మండల సమావేశం

కలిదిండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్ష తన ఈ నెల 29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

కలిదిండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల కమిటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించడం పట్ల రాష్ట్ర నాయి బ్రాహ్మణుల సాధికార కమిటీ సభ్యుడు లంకా రత్నారావు, నియోజకవర్గ నాయి బ్రాహ్మణుల సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి విజయ్ కుమార్, సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

2 నుంచి కార్తీక అన్నదానం



కరపత్రాన్ని ఎస్ఐకి అందజేస్తున్న గురుస్వామి

ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీహరిపురంలోని షిర్డీ సాయి మందిరంలో కార్తీక మాసం సందర్భంగా నవంబరు 2 నుంచి అయ్యప్ప, భవానీ దీక్షాపరులకు కార్తీక అన్నదాన కార్యక్రమం నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు గురుస్వామి నీలం మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొనాలని ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావును గురుస్వామి కోరారు.

అన్న సమారాధన



అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా కైకలూరులోని శ్యామలాంబ అమ్మవారి దేవస్థానం వద్ద ఆదివారం అన్నసమారాధనను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు ప్రారంభించారు. టీడీపీ నాయకుడు పూల రాజీ, బీజేపీ నాయకుడు వేంపాటి విష్ణురావు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ప్రస్తుతం వివిధ కేటగిరీల్లో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏపీపీసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం తీర్మా నించినట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం తెలిపారు. విజయ వాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పీఎసీఎస్ ఉద్యోగుల సమావేశంలో చేసిన తీర్మానా లను ఆయన వెల్లడించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ఆగిరిపల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): నరసింగపాలెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి రూ.3,100లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

అల్లూరులో...

ముదినేపల్లి : అల్లూరులో ఆదివారం సాయంత్రం ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో సిబ్బంది కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రూ.2 వేలు నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కోడూరులో ఆదివారం సాయంత్రం కోడిపందేలపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13,100 నగదు, రెండు కోడిపుంజులు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డుపైకి చేరుతున్న మురుగు



నూజివీడు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నూజివీడు గురుకుల పాఠశాల మురుగు నీరు బయటకు పోయే అవకాశం లేకపోవడంతో పాఠశాల పక్కనే ఉన్న రహదారిపై ఇదిగో ఇలా నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారుతోంది. ఎమ్మార్ అప్పారావు కాలనీ ప్రధాన రహదారి పక్కనే ముగురు నీరు నిలిచిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల సమీపానికి వచ్చే సరికి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని తక్షణం మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నెర్రలిచ్చిన పీహెచ్‌సీ రహదారి

▶▶ పట్టించుకోని వైద్యశాఖ అధికారులు

ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరో గ్య కేంద్రానికి వెళ్లే రహదారి ప్రమాద కరంగా మారింది. ముదినేపల్లి - అన్నవరం పంచాయతీ రాజ్ రోడ్డు నుంచి పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డును ఏళ్ల తరబడి అభివృద్ధి చేయ డం లేదు. పీహెచ్‌సీకి నిత్య వచ్చే వంద లాది మంది రోగులు ఇబ్బందులు పడుతు న్నారు. పీహెచ్‌సీ పాటు అదే ఆవరణలో ప్రభుత్వ హోమియో ఆస్పత్రి ఉంది. ఇక్కడే 108 వాహనం ఉంచుతారు. ఆ వాహనం బయటికి వెళ్లాలన్నా, లోపలికి రావాలన్నా ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. డ్రెయిన్ ఉన్న ప్రదేశంలో ఈ రహదారి కృంగిపోయి నెర్రలిచ్చింది. సుమారు 60 మీటర్ల దూరం మాత్రమే ఉన్న ఈ పీహెచ్‌సీ రహదారిని అభివృద్ధి చూసేందుకు వైద్యశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.



ముదినేపల్లి పీహెచ్‌సీ రహదారి దుస్థితి

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వాల నమోదు

కలిదిండి, కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వాల నమోదు ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం కలిదిండి, వెంకటాపురం, పడమటిపాలెం, కొచ్చెర్ల, మూల్లంక తదితర గ్రామాల్లో టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి గూడవల్లి శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, కోర్ కమిటీ సమన్వయ కమిటీ సభ్యుడు తేరా రమేష్, షాదిఖానా కమిటీ ఛైర్మన్ ఫరూక్ పాల్గొన్నారు. కైకలూరులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదుపై ఆదివారం కార్యకర్తలకు అవగాహన



కలిదిండి టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న జోగిరాజు, శ్రీనివాస్ చౌదరి



కైకలూరు టీడీపీ సభ్యత్వాల నమోదుపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీరాణి, త్రినాథరాజు

కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా నిర్వహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, మండల పార్టీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు, కైకలూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ జాని, మండల ప్రధాన కార్యదర్శి పంది రామకృష్ణ, నాయకులు గంగుల యేసురాజు, వీరాబత్తిన సుధ, పడమటి వాసు, బషీద్, అబీబ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్

నూజివీడు టౌన్/కలిదిండి, కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలోని బ్యాక్ బిల్డింగ్ ఇతర ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహిం చారు. పిచ్చి మొక్కలు తొలగించి, పారిశుద్ధ్య మెరుగుదల పనులు చేపట్టారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రావణి కనకకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు వి.తులసి, జి.నిరంజనితో పాటు 200 మంది వలంటీర్లు పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఆదివారం కలిదిండి ఎస్సీ బాలుర హాస్టల్ ఆవరణంలో



నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో వలంటీర్లు



కైకలూరు బీసీ హాస్టల్ ఆవరణ బాగు చేస్తున్న పోలీసు సిబ్బంది

పోలీసులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కైకలూరులోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహ ఆవరణలో సీఐ పి.కృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీను, వెంకట్ కుమార్, ఇతర పోలీసు సిబ్బంది పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముసునూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రమణక్కపేట జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1989-90 పదో తరగతి పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సందడి చేశారు. వారు చేస్తున్న వృత్తి, వ్యాపారాలను తెలిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరంగా సహపంతి భోజనాలు చేశారు. పాఠశాలకు సూమారు రూ.50 వేలు విలువగల సామగ్రిని వారు బహూకరించారు. పూర్వ విద్యార్థులు గోళ్ళ రమేష్, ఆకుల సుబ్బారావు, పొన్నూరు వెంకటప్రసాద్ తదితరులు ఈ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కేసులు సత్వరమే పరిష్కరించాలి : డీఎస్పీ



ముసునూరులో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ముసునూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుకోవాలని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ ఆదేశించారు. ముసునూరు పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులతో స్నేహ పూర్వకంగా మెలిగి, సమస్యపై స్పందించాలన్నారు. కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎస్ఐ చిరంజీవికి ఆయన సూచించారు. సారా, అక్రమ మద్యం, జూదాలపై ప్రతేక నిఘా పెట్టాలన్నారు. ఉచిత ఇసుక పాలసీలో అక్రమ రవాణాపై దృష్టి పెట్టాన్నారు. భూ వివాదాలను సామరస్యంగా పరిష్కరించి, ఇరువర్గాల వారికి తగు న్యాయం జరిగేలా చూడాలని డీఎస్పీ సూచించారు. ఏఎస్ఐ నాగభూషణరావు, హెడ్ కానిస్టేబులు అజయబాబు, విజయకుమార్ ఉన్నారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ’

ఏలూరు రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులు పోటీ చేయనున్నట్లు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్, ప్రముఖ సామాజికవేత్త, హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా యాదవ సంఘం భవనంలో ఆదివారం బహుజన రాజకీయ పార్టీల, సంస్థల ప్రతిని దులు, ప్రముఖులతో రౌండ్ టేబుల్ సవవేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బహుజన రాజకీయ శక్తులు ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. బీసీ కులాల జేఏసీ అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ పెరియార్, యు.గోపాల కృష్ణ, కె.వేణుగోపాలకృష్ణ, కె.నరసింహారావు, ఎన్.నాగమణి పాల్గొన్నారు.

గంగానమ్మ సంబరాలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపేట, నవాబ్‌పేటలోని గంగానమ్మ ఆలయాల వద్ద ఆదివారం అమ్మవారి వార్షిక సంబరాలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పవరుపేటలోని గంగానమ్మ ఆలయం వద్ద అమ్మవారికి 108 పసుపు నీటి బిందెలతో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బృందం స్నానోత్సవాన్ని నిర్వహించారు. బాలాజీ థియేటర్ సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో అయ్యప్ప అన్నదానోత్సవ కమిటీ ఆధ్వర్యంలో టి.ప్రసాద్ గురుస్వామిచే పడి పూజ, భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రం వద్ద అయ్యప్పస్వాములకు నిత్య భిక్షా కార్యక్ర మాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ముసునూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లిలోని ఉయానామోనాస్ట్రీ వ్యవస్థాపకులు జంపాల సత్యనా రాయణరాజు ఆధ్వర్యంలో జడ్పీ పాఠశాలలో ఆదివారం జరిగిన మె గా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ ప్రారంభించారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి, శంకర నేత్రాలయం, కృష్ణ ఆర్థోపెడిక్ ఆసుపత్రుల వైద్యులు, భీమవరం మెడికల్ కాలేజీ వైద్యులు, రాజమండ్రి పరమ హంస యోగానంద నేత్రాలయం తదితర ఆసు పత్రుల ప్రముఖ వైద్యులు వైద్య సేవలు అందించారు. సుమారు 1100 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అంది ంచారు. అత్యవసర చికిత్స నిమిత్తం 150 మంది ని



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆసుపత్రులకు రిఫర్ చేసినట్లు వైద్యు లు తెలిపారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు, పండ్లు అందజేశారు. సీఆర్‌రెడ్డి నర్సింగ్ కాలేజీ సిబ్బంది, ఎన్‌సీసీ సిబ్బంది వలంటీర్లుగా సేవలు అందించారు. ఎంపీటీసీ సభ్యులు కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, రాయంకుల రామారావు, మాజీ ఉపసర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ, ఎస్.మధుబాబు పాల్గొన్నారు.

104 డ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): 104 డ్రైవర్లకు సక్రమంగా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఎంఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 104 డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ సమస్య పరిష్కరించాలన్నారు.

అరకొరగా అందిన డైట్ చార్జీలు

ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బీసీ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల విద్యార్థులకు డైట్ చార్జీలు అరకొరగానే అందాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వసతిగృహాలకు భోజనం, ఇతర తినుబండారాల ఖర్చులకు ఏప్రిల్, జూన్ నెలకు సంబంధించి కొద్ది రోజులకు మాత్రమే డైట్ చార్జీలు ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. ఇంకా జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల డైట్ చార్జీలు విడుదల కావాల్సి ఉంది. దీంతో వసతిగృహ వార్డెన్లు విద్యార్థులకు అప్పులు చేసి భోజన సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కైకలూరు నియోజకవర్గంలోని 12 వసతి గృహాలకు పై మూడు నెలల డైట్ చార్జీలు సుమారు రూ.15 లక్షల వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉండడంతో వార్డెన్లు నిత్యావసర సరుకులు, పాలు, అరటిపండ్లు, స్నాక్స్‌లు అరువుపై వ్యాపారుల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి వార్డెన్లు హాస్టళ్లను



నిర్వహించాల్సి రావడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బం దులు నెలకొన్నాయి. ఒక్కొక్క హాస్టల్ వార్డెన్ ఇప్పటికే సుమారు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు అప్పుల పాలయ్యారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లుల కోసం వార్డెన్లు ఎదురుచూస్తున్నారు.





ఏపీ నిట్‌లో మాట్లాడుతున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి.. గవర్నర్‌ను సన్మానిస్తున్న వలవల బాబ్జి

చదువుకు సాంకేతికత జోడిస్తే అద్భుతాలు

▶▶ త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మన చదువుకు సాంకేతికత జోడిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. తాడేపల్లి గూడెం ఏపీ నిట్ ఆడిటోరియంలో విద్యార్థులకు స్పందనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అకడమిక్ ఎచీవ్‌మెంట్ బూస్ట్ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో వెనుకబడ్డామన్నారు. వాటిని అధిగమించి మంచినీటిని వినియోగంలో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే త్రిపుర మూడో చిన్న రాష్ట్రం అయినా విద్యలో ముందుందన్నారు. స్పందనా ఫౌండేషన్ నిర్వాహకురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి, వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెద కృష్ణంరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, శశి విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర, పైడికొండల సింధు పాల్గొన్నారు.

- భీమవరం విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ఉన్నారు. గవర్నర్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా భీమవరం పరిసర ప్రాంతాల్లో సమాజ సేవలందిస్తున్న సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిని సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద అభినందించి సత్కరించారు.

విద్యతోనే అభివృద్ధి సాధించవచ్చు

భీమవరం రూరల్ : దొంగపిండి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడారు. విద్యతోనే అభివృద్ధి సాధించవచ్చని తీర ప్రాంతం నుంచి వచ్చిన శ్రీపూజ ఐఏఎస్ ర్యాంక్ సాధించిందని, జిల్లా కలెక్టర్ అవ్వడం ఈ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ గ్రామానికి తీసుకు వచ్చిన ఆనంద గ్రూప్ ఛైర్మన్ భూపతిరాజు కాశీ విశ్వనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తుందుర్రులోని ఆక్వా ఫుడ్ పార్కును పరిశీలించారు. త్రిపుర ఫైనాన్స్ అండ్ ఐటీ మినిస్టర్ ప్రణదిత్ సింగరాయ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఒకరి హత్య

▶▶ ముగ్గురి మధ్య వివాదం.. పోలీసుల అదుపులో ఒకరు, మరొకరు పరారీ

మొగల్తూరు, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తుల మధ్య వివాదాలు చెలరేగడంతో ఓ వ్యక్తి హత్యకు గురైనట్టు మొగల్తూరు ఎస్.ఐ జి.వాసు తెలిపారు. మొగల్తూరు మండలం మోడి గ్రామానికి చెందిన మారెళ్ళ రాంబాబు (48) శనివారం రాత్రి మద్యం సేవించేందుకు ముత్యాలపల్లి గ్రామానికి వెళ్లాడు. మద్యం సేవించి వస్తుండగా మోడి సెంటర్‌లో రామాలయ పునఃనిర్మాణ సమావేశం జరుగుతోంది. ఇదే సమయంలో అక్కడికు వచ్చిన రాంబాబుకు అదే గ్రామానికి చెందిన జడ్డు నాయుడు, కొత్తకాయలతిప్పకు చెందిన ఉంగరాల వీరన్న మధ్య వివాదం నెలకొంది. ఆవేశానికి గురైన నాయుడు, వీరన్న రాంబాబును కొట్టడంతో తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి తమకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టామన్నారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య వెంకట కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో జడ్డు నాయుడు పరారీలో ఉండగా ఉంగరాల వీరన్న తమ అదుపులో ఉన్నట్టు ఎస్ఐ వివరించారు.





రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్‌లో) మృతదేహం

ఆవు మజ్జిగతో వరి సాగు

ఆరోగ్యమే మహాభాగ్యం.. అటువంటి ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ప్రస్తుతం మనం తింటున్న అన్ని ఆహార పదార్థాలు ఎరువులు, పురుగు మందులు వినియోగించి ఉత్పత్తి చేసినవే. వీటినే తిని ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నాం. అయితే ఆచంటలో చిలుకూరి విశ్వేశ్వరరావు అనే రైతు తన నాలుగు ఎకరాల వరి పొలంలో ఎరువులు, పురుగు మందులు వాడకుండా పులిసిన ఆవు మజ్జిగతో వరి సాగు చేస్తున్నారు. తన ఆరోగ్యంతో పాటు ఇతరుల ఆరోగ్యం కూడా బాగుండాలనే ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయంపై పదిమందికీ చెబుతున్నారు.

తక్కువ పెట్టుబడితో వ్యవసాయం

ఆచంటలో ఒక రైతు

సేంద్రియ పద్ధతిలో సాగు

ఆరోగ్యానికి ఎంతో మంచిది..



ఆవు పుల్లమజ్జిగతో సాగు చేస్తున్న వరి పొలం

ఆచంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 2019లో ఆచంటలో రైతు చిలుకూరి విశ్వేశ్వరరావు తనకు ఉన్న నాలుగు ఎకరాల పొలంలో మొదటి సారిగా ఎకరం పొలంలో ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం గిరి ఆవు పుల్ల మజ్జిగ , పంచగవ్య జీవామృతంతో సాగు చేశారు. మొదట్లో కాస్త దిగుబడి తగ్గినప్పటికి ఖర్చు తక్కువ అవడంతో తన నాలుగు ఎకరాల్లో నాలుగు సంవత్సరాలుగా ఎరువులు వాడకుండానే వ్యవసాయం చేస్తున్నారు. క్రమేణా దిగుబడి కూడా పెరగడంతో ఇదే విధానం కొనసాగిస్తున్నారు. సార్వాకు సంబంధించి ఎండీయు 1318 రకం , దాళ్వాలో సన్నబియ్యంకు సంబంధించి ఆర్ఎస్ఆర్ రకాన్ని సాగు చేస్తున్నారు. సార్వాకు ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు దాళ్వాకు 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ధాన్యం అమ్మకుండా ఆడించి అవసరమైన వారికి బియ్యం అమ్ముతున్నారు. రసాయనాలు వాడకుండా పండించిన ధాన్యం కోసం చాలామంది ఎదురు చూస్తున్నా రని అలాంటి వారందరూ తన దగ్గరకు వచ్చి బియ్యం తీసుకువెళతున్నారని రైతు చెబుతున్నారు.

మజ్జిగ కోసం ఆవుల పెంపకం

ఈ విధానంలో ఆవు మజ్జిగ ఎక్కువగా వినియోగిస్తారు. ఆవు మజ్జిగ కోసం ఇతరులపై ఆధారపడకుండా రైతు తన పొలం వద్ద ఏకంగా 20 ఆవులను మేపుతూ పాడి వ్యవసాయం కూడా చేపట్టారు. ప్రత్యేకంగా షెడ్డు వేసి ఆవు లను పెంచుతున్నారు. ఆవుపాలను మజ్జిగ చేసి ఆ మజ్జిగను నిల్వ చేసి పులిసిన మజ్జిగను ఈ విధానానికి ఉపయోగిస్తారు. 15 రోజుల పాటు డ్రమ్ముల్లో మజ్జిగను నిల్వ ఉంచుతారు. సార్వాకు సంబంధించి నాలుగు సార్లు, దాళ్వాకు సంబంధించి ఎనిమిది సార్లు ఈ పులిసిన మజ్జిగ స్ప్రే చేస్తారు. ఎకరానికి 30 లీటర్ల మజ్జిగను స్ప్రే ద్వారా వినియోగిస్తున్నారు. 15 నుంచి 20 రోజుల వ్యవలో స్ప్రే చేయాల్సి ఉంటుంది. పంట ఈనిక దశలో పంచగవ్యాలను కలిపి స్ప్రే చేస్తారు. అంటే ఆవుపేడ, గోమూత్రం, ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవునెయ్యిలను కలిపి ఎకరానికి మూడు లీటర్లు చొప్పున రెండు నుంచి మూడు స్లారు స్ప్రే చేయాల్సి ఉంటుందని రైతు వివరించారు. ‘నాకున్న నాలుగు ఎకరాల పురుగు మందులు వాడకుండా వరి సాగు చేస్తున్నాను. దిగుబడి బాగానే వస్తుంది. పెట్టుబడి తక్కువ. ఈ బియ్యం తినడం వల్ల ఎటువంటి అనారోగ్యం ఉండదు. ఎరువులు, పురుగు మందులు వాడని కారణంగా ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఎకరానికి కేవలం రూ.15 వేల రూపాయలు లోపు మాత్రమే ఖర్చు అవుతుందని విశ్వేశ్వరరావు పేర్కొన్నారు.